ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అంగళ్లులో వైసీపీ అరాచకానికి

నేటితో ఏడాది

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో ప్రాజెక్టుల సందర్శనకు వచ్చిన అప్పటి ప్రతిపక్ష నేత, మాజీ సీఎం చంద్రబాబుపై వైసీపీ శ్రేణులు రాళ్ల దాడి చేశాయి. అడ్డుకోవాల్సిన పోలీసులు తిరిగి ఆయనపైనే అక్రమంగా హత్యాయత్నం కేసు పెట్టారు. ఈ దురదృష్టకర, దుర్మార్గపు ఘటన జరిగి నేటికి సరిగ్గా ఏడాది అవుతోంది. అప్పట్లో ఈ సంఘటన దేశవ్యాప్తంగా సంచలనమైంది. ఈ సంఘటనలో పోలీసులు ఆరు కేసులు నమోదు చేశారు. అందులో ఐదు కేసులు... హత్యాయత్నం వంటి తీవ్ర సెక్షన్లతో టీడీపీ వర్గీయులపై నమోదు చేశారు. సంఘటన జరిగిన రోజు ఈ రాష్ట్రంలోనే లేని వాళ్లపైనా కేసులు నమోదు చేసి 45 రోజులు జైలుకు పంపారు. ఘర్షణకు కారణమైన వైసీపీ నాయకులపై కంటి తుడుపుగా బెయిలబుల్ కేసులు నమోదు చేశారు. తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె నియోజకవర్గాలకు చెందిన సుమారు 750 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలను కేసుల పేరుతో వేధించారు. సంఘటన జరిగి నేటికి ఏడాది కావస్తోంది.



అంగళ్లులో రాళ్లదాడి చేస్తున్న వైసీపీ కార్యకర్తలు (ఫైల్)

- పోలీసుల సహకారంతో చంద్రబాబుపై రాళ్ల దాడి
- ఆరు కేసుల్లో ఐదు టీడీపీ వర్గీయులపైనే...
- బాబుతో సహా ముఖ్య నేతలపై సెక్షన్ 307
- సుమారు 750 మందిపై పలు సెక్షన్లతో కేసులు అనేక మంది 45 రోజులపాటు జైళ్లలోనే..
- విచారణకు మంగళం.. చార్జ్‌షీట్ ఊసే లేదు
- ఘటనకు కారణమైన వైసీపీ నేతలు, ఖాకీలపై కేసులు పెట్టి శిక్షించాలని కోరుతున్న 'దేశం' శ్రేణులు

నాడు జరిగింది ఇదీ...

వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో నాశనమవుతున్న ప్రాజెక్టుల పరిశీలనకు ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు పర్యటన చేపట్టారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న హంద్రీనీవా కాలువను పరిశీలించారు. ములకలచెరువు మండలంలో నాయనిచెరువు వద్ద రైతులతో మాట్లాడారు. చంద్రబాబు జిల్లాలోకి అడుగు పెట్టక ముందే అంగళ్లలో వందలాది మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు కడప మార్గంలోని ఓ కల్యాణ మండపంలో గుమికూడారు. పోలీసుల సహకారంతో



రాళ్ల దాడి నుంచి చంద్రబాబును కాపాడుతున్న ఎన్ఎస్‌జీ కమాండోలు (ఫైల్)

జాతీయ రహదారిపై నల్ల బెలూన్లు, వైసీపీ జెండాలతో ఉన్న వైసీపీ నాయకులు చంద్రబాబు కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. రాళ్లు, ఇనుపరాడ్లు, కర్రలతో టీడీపీ శ్రేణులపై దాడికి పాల్పడ్డారు. టీడీపీ జెండా కట్టుకుని వెళుతున్న పలువురు ద్విచక్ర వాహనదారులపై దాడికి పాల్పడ్డారు. చంద్రబాబు ఉన్న వాహనంపైకి రాళ్లు పడుతుండడంతో ఆయన భద్రతాసిబ్బంది (ఎన్‌ఎస్‌జీ కమెండోలు) తమ చేతిలో ఉన్న షీల్డ్‌లను అడ్డుపెట్టి దెబ్బలు తగలకుండా కాపాడారు. దీంతో సహనం కోల్పోయిన చంద్రబాబు దాడికి పాల్పడుతున్న వైసీపీ నాయకులను తరిమికొట్టమని తమ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దీంతో తిరగబడ్డ టీడీపీ నాయకులు వైసీపీ వర్గీయులను తరమికొట్టారు. ఈ సంఘటనలో ఇరువర్గాలకు దెబ్బలు తగిలాయి. ఇదంతా అప్పటి మదనపల్లె డీఎస్పీ కేశప్ప సమక్షంలోనే జరగడం విశేషం. ఓ వైసీపీ నేత ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా చంద్రబాబు సహా.. పలువురు టీడీపీ ముఖ్య నాయకులపై హత్యాయత్నంతో పాటు అనేక ఆరోపణలతో కేసులు కట్టారు. మరో నాలుగు కేసుల్లో తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె నియోజకవర్గాలకు చెందిన తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా ఉన్న నాయకులు, కార్యకర్తలను ఇరికించారు. అప్పట్లో మదనపల్లె రూరల్ సీఐగా పనిచేసిన శివాంజనేయులు వైసీపీ నాయకుల సూచనల మేరకు అమాయకులపై సైతం కేసులు పెట్టారనే ఆరోపణలు ఉన్నాయి.

ఇప్పటికీ చార్జ్‌షీట్లు వేయలేదు

సాధారణంగా ఏదైనా సంఘటన జరిగితే 90 రోజుల్లోగా చార్జ్‌షీట్ వేయాలి. అయితే అంగళ్ల సంఘటన జరిగిన నేటికి ఏడాది దాటుతున్నా చార్జ్‌షీటు వేయలేదు. కనీసం విచారణ కూడా పూర్తి చేయలేదు. వైసీపీ నాయకులు చెప్పిన వాళ్లందరినీ కేసుల్లో ఇరికించి జైలుకు పంపించారు. అప్పుడు ఇక్కడ ఉన్న పోలీసు అధికారులూ బదిలీపై వెళ్లిపోయారు. అంగళ్ల కేసులు అటకెక్కాయి.

రెచ్చిపోయిన వైసీపీ నేతలపై కేసులు పెట్టాలి

అధికారం, పోలీసుల అండ చూసుకుని అప్పట్లో రెచ్చిపోయిన వైసీపీ నాయకులపై కేసులు నమోదు చేయాలని టీడీపీ నాయకులు కోరుతున్నారు. అంగళ్లలో ఆరోజు విధ్వంసానికి పాల్పడిన వైసీపీ నాయకులు పలువురు గత ఐదేళ్లలో అనేక అక్రమాలకు పాల్పడ్డారని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అదేవిధంగా వైసీపీ కార్యకర్తల కంటే దారుణంగా పనిచేసిన పలువురు పోలీసు అధికారులను సైతం చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

పుంగనూరు లేగదూడల ప్రదర్శన



పుంగనూరు లేగదూడల ప్రదర్శనలో పాల్గొన్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్.. తదితరులు

రైల్వేకోడూరు, ఆగస్టు 3: లింగ నిర్ధారణ వీర్యం ద్వారా పుట్టిన లేగదూడల ప్రదర్శన కార్యక్రమం రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంట పశువైద్యశాల ఆవరణంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రీయ గోకుల మిషన్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో చేపట్టిన పిండ మార్పిడి విధానం ద్వారా దేశంలోనే ప్రప్రథమంగా పుంగనూరు దూడను పుట్టించడం జరిగిందన్నారు. ఇది రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంటలోనే జరగడం గర్వకారణంగా ఉందన్నారు. నాటు గేదెకు వీర్యం ఎక్కించడం ద్వారా ఒంగోలు దూడను పుట్టించారని తెలిపారు. ఈ ప్రదర్శనలో ప్రథమ బహుమతి ప్రియా, ద్వితీయ బహుమతి లాలమ్మ, తృతీయ బహుమతి కులాయి రఘు అనే పాడి రైతులకు దక్కింది. వారికి బహుమతులను అందజేశారు. ఈ ప్రదర్శనలో 65 లింగ నిర్ధారిత దూడలను పాడి రైతులు ఉంచారు. కార్యక్రమంలో రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో డాక్టర్ శ్రీనివాసరావు, జిల్లా ఈవో డీఎల్‌డీఏ డాక్టర్ గుణశేఖర్, ఈవోడీఎల్‌డీఏ తిరుపతి డాక్టర్ రాజశేఖర్, రాజంపేట డీడీ డాక్టర్ విజయభాస్కర్‌రావు, రాయచోటి డీడీ డాక్టర్ మాలకొండయ్య, రైల్వేకోడూరు ఏడీ డాక్టర్ సురేష్‌రాజు, శెట్టిగుంట సర్పంచ్ శివశైలజ, పశుమిత్రలు, సిబ్బంది పాల్గొన్నారు.

సూక్ష్మ నీటి పారుదలే లక్ష్యం

- పరికరాల కోసం దరఖాస్తు చేసుకోండి

రాయచోటి (కలెక్టరేట్), ఆగస్టు 3: జిల్లాలో వందశాతం సూక్ష్మ నీటి పారుదల లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా సూక్ష్మ నీటి పారుదల శాఖాధికారి వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 సంవత్సరానికి 36 వేల హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం అమలు చేసి కరువు రహిత జిల్లాగా, ఉద్యాన వన హబ్‌గా అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టామని ఆయన తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో నీటి ఎద్దడి తట్టుకునేందుకు, సాగునీటిని సద్వినియోగం చేసుకునేందుకు బిందు సేద్యం ఒక్కటే మార్గం అన్నారు. జిల్లాలో టమాటా, అన్ని రకాల కూరగాయలు, అరటి, పూలతోటలు లాంటివి సాగు చేసుకోవచ్చన్నారు. రైతులకు అవసరమయ్యే పరికరాల కోసం రైతు సేవా కేంద్రాలలో ఉండే వ్యవసాయాధికారులను సంప్రదించి బయోమెట్రిక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

జిల్లాలో 12 మంది తహసీల్దార్ల బదిలీ

రాయచోటి (కలెక్టరేట్), ఆగస్టు 3: ఉమ్మడి కడప జిల్లాలో 12 మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ కడప జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వి.పుల్లారెడ్డిని రాయచోటి తహసీల్దార్‌గా, రాజంపేటకు మహబూబ్‌చాంద్, గాలివీడుకు భాగ్యలత, ఉదయ్‌శంకర్‌రాజును ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా, శేషయ్యను రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవోగా బదిలీ చేశారు. అలాగే తులశమ్మను రాయచోటి ఆర్డీవో కార్యాలయ ఏవోగా, నరసింహులును చిన్నమండెం తహసీల్దార్‌గా, నాగభూషణంను కలెక్టరేట్ ఏవోగా, ఎంవీ సుబ్రమణ్యంరెడ్డిని రాయచోటి కలెక్టరేట్‌లోని ల్యాండ్ అక్విజేషన్ సూపరింటెండెంట్‌గా, డి.శ్రావణిని వీరబల్లి తహసీల్దార్‌గా, ఎం.దైవాదీనంను టి.సుండుపల్లె తహసీల్దార్‌గా, కె.అమర్‌నాథ్‌ను నందలూరు తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రజల కష్టాలు వింటూ.. వినతులు స్వీకరిస్తూ..

- ప్రజాదర్బార్‌లో బాధితులకు మంత్రి భరోసా

రాయచోటిటౌన్, ఆగస్టు 3: మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శనివారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు తమ సమస్యలు విన్నవించేందుకు వందల మంది ప్రజలు తరలివచ్చారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు ఉదయం 9 గంటలకే ఇక్కడికి చేరుకుని వినతిపత్రాలతో బారులు తీరారు. విజయవాడ నుంచి జిల్లాకు చేరుకున్న మంత్రి మండిపల్లికి రోజురోజుకు అధిక సంఖ్యలో బాధితులు తమ సమస్యలు పరిష్కరించాలని అర్జీలు సమర్పిస్తున్నారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను స్వీకరిస్తున్న మంత్రి ఆయా ఫిర్యాదులను పరిశీలిస్తూ ఆయా శాఖల అధికారులను సమన్వయం చేయడమే కాకుండా సమస్యలు వెంటనే పరిష్కారం అయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తున్నారు.



ప్రజల సమస్యలు వింటున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ఫైళ్ల దహనం ఘటనలో లెక్క తేలుతోంది

- మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా, మాధవరెడ్డి, రామకృష్ణారెడ్డిపై కేసులు
- నలుగురిపై ఒకే సెక్షన్లతో కేసులు నమోదు

మదనపల్లె టౌన్, ఆగస్టు 3: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం ఘటనకు అనుసంధానంగా పోలీసులు నమోదు చేసిన కేసుల లెక్కతేలుతోంది. కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ చెప్పినట్లు పోలీసులు నమోదు చేసిన ఎనిమిది కేసుల్లో ఇదివరకే మున్సిపల్ వైస్‌ఛైర్మన్ జింకా చలపతిపై ఏడు సెక్షన్లతో నాన్‌బెయిలబుల్ కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ కేసులో పోలీసులు, సీఐడీ అధికారులు పలువురి అనుమానితుల ఇళ్లలో సోదాలు చేసి ఉండకూడని కీలకపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో మదనపల్లె మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఇంటిలో తనిఖీలు చేసిన పోలీసులు ఎనిమిది ఆస్తులకు సంబంధించి డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషాపై కూడా పోలీసులు జూలై 28వ తేదీ టూటౌన్ పోలీసుస్టేషన్‌లో సీఐ మల్లికార్జున గుప్తా ఫిర్యాదుతో క్రైమ్ నెంబర్ 209/2024తో ఎఫ్‌ఐఆర్‌లో ఏడు సెక్షన్లతో పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో పాటు మాజీ మంత్రి పెద్దిరెడ్డి ముఖ్య అనుచరుడు వి.మాధవరెడ్డి ఇంట్లో కూడా సోదాలు చేసిన పోలీసులు 590 డాక్యుమెంట్ల జిరాక్స్ పత్రాలు, మరికొన్ని కీలకపత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై మదనపల్లె వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో సీఐ పి.నాగేంద్ర ఫిర్యాదు మేరకు క్రైమ్ నెంబర్ 138/2024 కింద ఏడు సెక్షన్లతో కేసు నమోదు చేశారు. అలాగే మాధవరెడ్డి సమీప బంధువు రెడ్డెప్పనాయుడు కాలనీకి చెందిన కె.రామకృష్ణారెడ్డి ఇంట్లో పోలీసులు సోదాలు చేయగా కొన్ని పత్రాలు లభించడంతో సీఐ శంకరమల్లయ్య ఫిర్యాదుతో టూటౌన్ పోలీసుస్టేషన్‌లో క్రైమ్ నెంబర్ 210/2024తో ఏడు సెక్షన్లతో ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. ఇదిలా ఉండగా మిగిలిన నాలుగు కేసుల్లో సబ్ కలెక్టరేట్‌లో పనిచేసిన ఓ ఉద్యోగితో పాటు, ఇద్దరు అనుమానితులపై వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో, ఇంకో వైసీపీ నాయకుడిపై తాలూకా పోలీసుస్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ క్రమంలో ఎవరిపై అయితే కేసులు నమోదు చేశారో వారందరూ పరారీలో ఉండటంతో పాటు, హైకోర్టులో ముందస్తు బెయిల్ పొందటానికి పిటీషన్లు వేసినట్లు తెలిసింది.



బాలికపై పద్నాలుగేళ్ల బాలుడు అత్యాచారం

కలికిరి, ఆగస్టు 3: ఐదేళ్ల వయసున్న బాలికపైన పద్నాలుగేళ్ల బాలుడు అత్యాచారానికి ఒడిగట్టిన సంఘటన మండలంలో కలకలం రేపుతోంది. కలికిరి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలిక ఒకటో తరగతి చదువుతోంది. అదే గ్రామానికి చెందిన పద్నాలుగేళ్ల బాలుడు ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. శనివారం పాఠశాల వదిలిన తరువాత సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో బాలికను స్వీట్లు ఇస్తాను రమ్మంటూ ఆ బాలుడు తన ఇంటికి తీసుకెళ్లాడు. ఇంట్లోకి వెళ్లగానే తలుపు గడియ వేసి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం అక్కడి నుంచి బాలిక ఏడుస్తూ ఇంటికెళ్లింది. ఏడుస్తున్న బాలికను చూసి తల్లిదండ్రులు జరిగిన విషయం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆ వెంటనే కలికిరి పోలీసుస్టేషనుకు చేరుకుని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు బాలికను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అత్యాచారానికి పాల్పడిన బాలుడిని, అతడి తల్లిదండ్రులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి మహిళా వైద్యురాలిని రప్పించి బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టర్ ఆర్.మోహన్ తెలిపారు.

గంజాయి పాపం.. వైసీపీదే..!



- తంబళ్లపల్లెలో గంజాయి అమ్మకాలు
- వైసీపీ ప్రభుత్వ హయాంలో మూతపడ్డ చెక్‌పోస్టులు
- యథేచ్ఛగా.. చాపకిందనీరులా విస్తరణ

ములకలచెరువు, ఆగస్టు 3: వైసీపీ ప్రభుత్వ పాలనలో తాలిబన్ రాజ్యంగా పేరొందిన తంబళ్లపల్లె నియోజకవర్గంలో గంజాయి అమ్మకాలు జోరుగా సాగాయి. వైసీపీ పాలనలో మారుమూల ప్రాంతానికి గంజాయి మరక అంటించారు. ఆంధ్ర-కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టులను వైసీపీ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లకు ఎత్తేయడంతో గంజాయి రవాణా కర్ణాటక రాష్ట్రానికి యథేచ్ఛగా సాగింది. బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాలకు కేవలం 5 కిలోమీటర్ల దూరంలో కర్ణాటక సరిహద్దుతో పాటు గ్రామాలు ఉండడంతో గంజాయి అక్రమ రవాణా జోరుగా సాగింది. ములకలచెరువు సర్కిల్ పరిధిలోని పెద్దతిప్పసముద్రం పోలీసులు ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో వంద కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఆరుగురిని అరెస్టు చేసి రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. ఉత్తరాంధ్రతో పాటు ఒరిస్సా సరిహద్దుల నుంచి స్మగ్లర్ల నుంచి గంజాయిని ములకలచెరువు-పెద్దతిప్పసముద్రం మండలాల సరిహద్దులోని సంద్రడివికి తీసుకొచ్చి జనసంచారం, వాహనాల రాకపోకలు అంతంతమాత్రంగా ఉండే సంద్రడివిని కేంద్రంగా చేసుకుని బి.కొత్తకోటతో పాటు కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా తరలించినట్లు అప్పట్లో వెల్లడైంది. రిజర్వు ఫారెస్టైన సంద్రడివి స్మగ్లర్లు గంజాయి పాయింట్‌గా పెట్టుకుని ఇక్కడ గంజాయి ప్యాకెట్లు ఇతర వాహనాల్లోకి మార్చి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. తంబళ్లపల్లె నియోజకవర్గమైన ములకలచెరువు, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, కురబలకోట మండలాల్లో జోరుగా ఇప్పుడు కూడా వైసీపీ కనుసన్నల్లో గంజాయి అమ్మకాలు జరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా యువత గంజాయి బారిన పడి చిత్తు అవుతున్నారు. ప్రధాన కాలేజిల వద్దే టార్గెట్‌గా పెట్టుకుని గంజాయి విక్రయాలు సాగిస్తున్నట్లు సమాచారం.

పెరుగుతున్న నేరాలు.. చిత్తవుతున్న బతుకులు

తంబళ్లపల్లె నియోజకవర్గంలో గంజాయి విక్రయాలు జరుగుతుండడంతో దాని బారిన పడి పలువురు బతుకులు చిత్తు చేసుకుంటున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో నేరాలు పెరుగుతున్నాయి. తంబళ్లపల్లె మండలంలో గంజాయి, మద్యానికి బానిసైన తన కొడుకును ఓ తండ్రి చంపించాడు. ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థి గంజాయి, మద్యానికి బానిసై కుటుంబ సభ్యులపై తిరగబడి చంపుతానని బెదిరించడంతో ప్రాణహాని ఉందని భావించిన తండ్రే కొడుకును హత్య చేయించాడు. ఆరు నెలల క్రితం జరిగిన ఈ ఘటన అప్పట్లో చర్చనీయాంశమైంది. అలాగే ములకలచెరువు, కురబలకోట మండలాల్లో గంజాయి బారిన పడ్డ యువకులు దాడులు, ప్రతి దాడులు చేసుకున్న ఘటనలు ఎన్నో ఉన్నాయి.

అనంతపురం గంజాయికి ములకలచెరువుతో లింకు

అనంతపురంలో పట్టుబడ్డ గంజాయికి ములకలచెరువుతో లింకు ఏర్పడింది. గత ఏడాది జూన్ నెలలో అనంతపురం నగరానికి చెందిన యువకులు అనంతపురం జిల్లా రాప్తాడు వైసీపీ ఎమ్మెల్యే స్టిక్కర్ ఉన్న ఇన్నోవా వాహనంలో వెళ్తూ నానా హంగామా సృష్టించారు. దీంతో అప్పట్లో సంచలనం రేగిన ఈ ఘటనకు సంబంధించి అనంతపురం నగరానికి చెందిన యువకులను శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై అప్పటి శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ విచారణ చేపట్టారు. అనంతపురం యువకులు ములకలచెరువుకు వచ్చి ఇక్కడ గంజాయిని కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఈ విషయాన్ని అప్పట్లో ఎస్పీ అక్కడ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. అప్పట్లో ఈ విషయం ములకలచెరువులో పెద్ద చర్చనీయాశమైంది.

గంజాయిపై ఉక్కుపాదం మోపే దిశగా ప్రభుత్వం

గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలపై ఉక్కుపాదం మోపే దిశగా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. టాస్క్‌ఫోర్స్‌లు ఏర్పాటు చేసి గంజాయి మరకలను తుడిచేయాలని చూస్తోంది. గ్రామాల్లో గంజాయి అమ్మకాలు, అక్రమ రవాణా మూలాలను కనుగొని పూర్తి స్థాయిలో పకడ్బందీగా అరికట్టాలని చర్యలు చేపట్టింది.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు (ఫైల్)



గంజాయి దాచారని సంద్రడివిలో తనిఖీలు చేస్తున్న పోలీసులు (ఫైల్)

గంజాయిపై టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుకు చర్యలు



గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపేందుకు ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలు అరికట్టేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నాం. స్థానిక పోలీసులతో కలిసి నియంత్రణకు చర్యలు తీసుకున్నాం. సంద్రడివి అటవీ ప్రాంతంలో తనిఖీలు చేస్తున్నాం. ముఖ్యంగా రైల్వేస్టేషన్, బస్టాండుల్లో నిఘా పటిష్టం చేశాం. ఆంధ్ర-కర్ణాటక సరిహద్దు వద్ద నిఘా పెట్టాం.

- రామ్మోహన్, ఎస్ఈబీ సీఐ ములకలచెరువు సర్కిల్

తెలుగుగంగ రైతులకు గుడ్‌న్యూస్

పదిరోజుల్లో

తెలుగుగంగకు కృష్ణాజలాలు

నేటికల్లా ఎస్‌ఆర్-1కు నీళ్లు

(కడప - ఆంధ్రజ్యోతి): కరువుగడ్డ కడప జిల్లాను క్రిష్ణాజలాలతో సస్యశ్యామలం చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రధాన లక్ష్యం. ఇందుకు తగ్గట్లుగానే 2014-19 పాలనలో గండికోటకు నీళ్లు తెచ్చి ఎండిపోతున్న చీనీ చెట్లను కాపాడి అపరభగీరధుడిటగా మారారు. అయితే ఇప్పుడు మళ్లీ సీఎం చంద్రబాబు నేతృత్వంలో రైతులకు మంచిరోజులు రానున్నాయి. చంద్రబాబు నాయుడు రెండురోజుల కిందట వెలుగోడు నుంచి నీరు విడుదల చేశారు. సీమలోని ప్రతి ఎకరాకు సాగునీరందించడమే లక్ష్యమన్నారు. అందుకు తగ్గట్లుగానే అడుగులు పడుతున్నాయి. అయితే ఎస్‌ఆర్1, ఎస్‌ఆర్2కు జలాలు చేరుకోనున్నాయి. ఎస్‌ఆర్-1 కెపాసిటీ 1.8 టీఎంసీలు. ఎస్‌ఆర్-1,2లు నాలుగు టీఎంసీల సామర్థ్యం. అవి నిండిన వెంటనే నేరుగా బ్రహ్మంసాగర్ రిజర్వాయరుకు వెళతాయి. బ్రహ్మంసాగర్ సామర్థ్యం 17 టీఎంసీలు, ప్రస్తుతం అక్కడ రెండు టీఎంసీల నీరుంది. అయితే ఈసారి బ్రహ్మంసాగర్‌ను పూర్తిస్థాయి నీటితో నింపాలని నిర్ణయించారు. ఈ మేరకు తెలుగుగంగ ఇన్‌చార్జ్ ఎస్‌ఈ వెంకటరామయ్య ఆధ్వర్యంలో ప్రధాన కాల్వలో ఉన్న ముళ్లకంపలు తొలగించడం, దెబ్బతిన్న కాల్వ మరమ్మత్తులను ముమ్మరంగా



ముమ్మరంగా సాగుతున్న తెలుగుగంగ కాల్వ మరమ్మతు పనులు

చేపట్టారు. తెలుగుగంగ పరిధిలో ప్రస్తుతం నేరుగా లక్ష ఎకరాలకు సాగునీరు అందనుంది. ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు 1.80లక్షల ఎకరాలకు నీరు అందునుంది. త్వరితగతిన నీళ్లు ఇచ్చేందుకు చంద్రబాబు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తెలుగుగంగ పరిధిలో దువ్వూరు, మైదుకూరు, బి.మఠం. పోరుమామిళ్ల, బి.కోడూరు, కాశినాయన, కలసపాడు, బద్వేలు మండలాలకు సాగునీరు అందనుంది. ఇటీవల కలసపాడు మండలం నుంచి తణుకువాగు ఎత్తిపోతలను ప్రారంభించారు. ఇప్పటికి బద్వేలు, మైదుకూరు నియోజకవర్గంలో పుష్కలంగా సాగుకు నీరు అందనుంది. కలసపాడు మండలంలో ఏర్పాటు చేసిన లిఫ్ట్‌తో ఎగువరామాపురం, ఎగువతంబళ్లపల్లె, తెల్లపాడు ప్రాంతాలకు కూడా సాగునీరు అందనుంది. కలసపాడు మండలం ఎగువరామాపురం, ఎగువతంబళ్లపల్లె, తెల్లపాడు, కాశినాయన మండలం వరికుంట్ల ప్రాంతాలకు ఇప్పటి వరకు నేరుగా సాగునీరు అందలేదు. ఈసారి ఎత్తిపోతల ద్వారా సాగునీరు అందనుంది. పరోక్షంగా కూడా సాగునీరు అందనుంది.

చెరువులన్నింటినీ నీటితో నింపుతాం



బద్వేలు, మైదుకూరు నియోజకవర్గాల్లో 140 చెరువులను కృష్ణాజలాలతో నింపుతున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన విధంగా జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీటిని అందించేలా ప్రణాళికలు రూపొందించాం. అందుకు తగ్గట్లుగా ప్రణాళికలు తయారు చేశాం. ప్రతి వర్షం నీటి బొట్టును సద్వినియోగం చేసుకుంటాం.

వెంకటరామయ్య, తెలుగుగంగ ఎస్‌ఈ

కడప ప్రకాశ్‌నగర్‌లో చోరీ

- బీరువా ధ్వంసం చేసి 10 తులాల బంగారం, నగదు అపహరణ
- చోరీ ఘటనను పరిశీలించిన చిన్నచౌకు పోలీసులు



చిందర వందరగా పడిన సామాను

కడప (క్రైం), ఆగస్టు 3: కడప నగరం ప్రకాశ్‌నగర్‌లోని ఓ ఇంట్లో దొంగలు పడి బంగారు నగలు, నగదు అపహరించారు. శనివారం ఇంటికి వచ్చి చూసేసరికి తాళాలు పగిలిపోయి ఉండడం, ఇంట్లో బీరువా ధ్వంసమవడంతో బాధితులు చిన్నచౌకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రకాశ్‌నగర్‌కు చెందిన వరలక్ష్మి భర్త రమణయ్య ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉండేవాడు. ఇటీవల ఆయన గుండెపోటుతో మరణించాడు. చనిపోయిన రమణయ్య స్వగ్రామం చెన్నూరు మండలం కొక్కిరాయపల్లె కావడంతో కార్యక్రమాల కోసం సొంతూరులోనే ఉన్నారు. దొంగలు ప్రకాశ్‌నగర్‌లోని ఇంట్లో తాళాలు పగలగొట్టి బీరువా ధ్వంసం చేసి అందులో ఉన్న పది తులాల బంగారం, రూ.4.30 లక్షల నగదు దోచుకెళ్లారు. ఆస్పత్రి ఖర్చుల కోసం నగదు ఇంట్లో తెచ్చి పెట్టామని, అయితే దొంగలు పడి బంగారు, నగదు దోచుకెళ్లారంటూ బాధితురాలు వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి తెలిపారు.

పెట్రోలు బంకు స్థలాన్ని పరిశీలించిన జేసీ



స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ ఆదితిసింగ్

చాపాడు, ఆగస్టు 3: అల్లాడుపల్లె దళితవాడ వద్ద కొత్తగా ఏర్పాటు చేసుకున్న పెట్రోలు బంకుకోసం స్థలాన్ని జాయింట్ కలెక్టర్ ఆదిత్‌సింగ్ శనివారం పరిశీలించారు. అల్లాడుపల్లెకు చెందిన హుస్సేన్‌బాష పెట్రోలు బంకు ఏర్పాటు చేసుకునేందుకు కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. సర్వే నంబరు 185లో 23 సెంట్ల స్థలాన్ని జేసీ పరిశీలించారు. జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు, డీటీ యామినీ, వీఆర్వో ప్రణయ్‌ను అడిగి రెవెన్యూ రికార్డు వివరాలను ఆమె తెలుసుకున్నారు. గ్రామస్థులతో మాట్లాడి అభ్యంతరం లేని విధంగా మాట్లాడుకోవాలని జేసీ దరఖాస్తుదారుడికి సూచనలు ఇచ్చారు. ఆమె వెంట ఆర్ఐ ప్రమీల, సర్వేయర్ సాయిలత తదితరులు ఉన్నారు.

మొక్కలతోనే ఆరోగ్యకర పర్యావరణం : వీసీ

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 3: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం ద్వారా రాబోయే తరాలకు ఆరోగ్యకర వాతావరణాన్ని అందించగలమని వైవీయూ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి అన్నారు. శనివారం వైవీయూలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో వనమహోత్సవంలో ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పులకు పరిశ్రమలు వెదజల్లుతున్న కార్బండయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ మానవాళికి ప్రమాదకరంగా మారిందన్నారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు వర్షాల కోసం విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసరు రఘునాదరెడ్డి మాట్లాడుతూ మాన్సూన్ వన మహోత్సవం యూనివర్శిటీలో పండుగ వాతావరణం తెచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎన్.వెంకట్రామిరెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ క్యాంపస్ సెలెక్షన్స్‌లో 82మందికి ఉద్యోగాలు



వేంపల్లె, ఆగస్టు 3: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో జరిగిన క్యాంపస్ సెలక్షన్స్‌లో 82మంది విద్యార్థినీ విద్యార్థులు ఉద్యోగాలు పొందారు. న్యాక్ టెక్నాలజీస్ సంస్థ ఆధ్వర్యంలో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో కొద్దిరోజులుగా క్యాంపస్ ఇంటర్వ్యూలు జరిగాయి. సీఈసీ, ఈసీఈ, సివిల్, ఈఈఈ, మెకానికల్ విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు. రూ.6లక్షల వార్షిక వేతనంతో 82మంది విద్యార్థులు ఎంపికైనట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. ఆ విద్యార్థులను అభినందించారు. ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ సంద్ర, ఏఓ రవికుమార్, డీన్ రత్నకుమారి, ప్లేస్‌మెంట్ అధికారులు వినోద్, సుందర్, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

సంపద సృష్టిపై జాతీయ సదస్సు

- వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 3: ఆర్థిక ప్రణాళికతో సంపద సృష్టిపై జాతీయ సదస్సు 5న నిర్వహిస్తున్నట్లు వైవీయూ వీసీ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి తెలిపారు. శనివారం వైవీయూ పరిపాలన విభాగంలో వెబ్‌నార్ కన్వీనర్, రిజిస్ట్రార్ ఎస్.రఘునాధరెడ్డితో కలిసి పోస్టరును ఆవిష్కరించారు. సెక్యూరిటీ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా పూర్వపు డీజీఎం అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్ కన్సల్టెంట్ సూర్యకాంత్‌శర్మ కీలకోపన్యాసం చేస్తారన్నారు. లింకు ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చన్నారు. పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి, వాణిజ్య శాఖ ప్రొఫెసర్ విజయభారతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హరినాథ్, ప్రొఫెసర్ ఎంవీ శంకర్ పాల్గొన్నారు.

సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులుగా ప్రొఫెసరు పార్వతి



నియామక పత్రం అందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 3: కడపనగరం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులుగా వైవీయూ తెలుగుశాఖ ప్రొఫెసరు జి.పార్వతిని నియమిస్తూ వైస్‌చాన్సలర్ కె.క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఎస్.రఘునాదరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం వైవీయూలో పార్వతికి నియామకపత్రం అందించారు. ఇప్పటి వరకు పనిచేస్తున్న రాంప్రసాద్‌రెడ్డి పదవీ కాలం పూర్తవడంతో డైరెక్టరు బాధ్యతల నుంచి ఆయనను తప్పించి ఆయన స్థానంలో ప్రొఫెసరు పార్వతిని నియమించారు. నూతన డైరెక్టరును పలువురు అభినందించారు.

ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్ల స్వాధీనం



రెవెన్యూ కార్యాలయానికి తరలించిన వాహనాలు

ఒంటిమిట్ట, ఆగస్టు 3: మంగంపేట రెవెన్యూ పరిధి సర్వేనంబరు 2లో అక్రమంగా మట్టి రవాణా చేపట్టారు. అక్రమ రవాణా చేపడుతున్నారని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు రావడంతో రెవెన్యూ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకుని రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. తహసీల్దారు రమణమ్మ తెలిపిన వివరాల మేరకు మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్నారని సమాచారం అందడంతో రెవెన్యూ సిబ్బంది వెళ్లి ఒక ట్రాక్టర్‌ను, ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్నామని, వాహనాలకు జరిమానా విధించామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటరమణ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎక్సకవేటరు, డోజరు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనాలు

అట్లూరు, ఆగస్టు 3: నల్లాయపల్లె భూములను అనుమతులు లేకుండా గుర్తు తెలియని వ్యక్తులు బద్వేలు నుంచి తెప్పించిన ఎక్స్‌కవేటరు, డోజరుతో శనివారం పదను చేస్తుండగా వాహనాలను వీఆర్వోలు, పోలీసులు అదుపులోకి తీసుకుని అట్లూరు ఎస్ఐ కేసీ రాజుకు స్వాధీనం చేశారని అట్లూరు తహసీల్దారు రవిశంకర్ తెలిపారు. ఇటీవల భూములను కబ్జా చేస్తుండడంతో నల్లాయపల్లె భూపట్టాదారుల ఫిర్యాదు మేరకు బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ ఆదేశాల మేరకు భూసమగ్ర సర్వే నిర్వహించారు. పంపిణీ చేసిన పట్టా, ప్రభుత్వ భూములను గుర్తించారు. శనివారం అక్రమార్కులు వాహనాలతో భూములను చదను చేయడంపై చదను చేసిన భూములను సర్వే చేసి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో సుబ్బయ్య, పోలీసులు వెంకటయ్య, చంద్ర ఉన్నారు.

విద్యార్థుల హక్కులను గౌరవిద్దాం

జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు3: విద్యార్థుల హక్కులను గౌరవిస్తూ, వారికి భద్రమైన, సురక్షితమైన బాల్యాన్ని అందిచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై వుందని జాయింట్ కలెక్టర్ ఉద్బోధించారు. శనివారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ అధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి వర్క్‌షాపులో జిల్లాలోని ఎంఈఓలు, ప్రధాన ఉపాధ్యాయులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎన్.సి.పి.సి.ఆర్ ప్రతినిధి చిట్టిబాబు మాట్లాడుతూ విద్యార్థులకు సైబర్ సేఫ్టీపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై వుందన్నారు. డీఈఓ మాట్లాడుతూ పిల్లలను శారీకంగా, మానసికంగా వేధించారన్నారు. కార్యకర్మంలో నోడల్ అధికారి కరుణకర్, డైట్ లెక్చరర్లు, అజయ్ కుమార్, శ్రీదేవి, రాధ, జనార్ధన్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

పోరుమామిళ్ల, ఆగస్టు 3: గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులు ఉపాధి కల్పన, వ్యవస్థాపక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలు పొందాలని జేసీఓ ఆంజనేయులు తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగులకు మూడు నెలలు కంప్యూటరు నేర్పించి శిక్షణలో ఉచిత వసతి, భోజనం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయినా ఈఅవకాశం వినియోగించుకోవచ్చన్నారు. ఆసక్తి ఉన్నవారు 5లోపు కడప టీడీడీసీలో లగేజీతో హాజరు కావాలన్నారు. ఏదైనా సందేహాలు ఉంటే 7731013622కు ఫోను చేయాలన్నారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి

- చర్చావేదికలో బార్ అసోసియేషన్ల నేతలు

కడప(రూరల్), ఆగస్టు 3: న్యాయవాదుల సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా అసోసియేషన్ల అధ్యక్షులు, నేతలు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలోని కడప బార్ అసోసియేషన్‌లో అధ్యక్షుడు గుర్రప్పనాయుడు ఆధ్వర్యంలో న్యాయవాదుల సమస్యలపై నిర్వహించిన చర్చావేదికలో కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్పనాయుడు మాట్లాడుతూ సమాజంలో న్యాయవాదుల పాత్ర కీలకమైందన్నారు. తొలితరం న్యాయవాదులు స్వాతంత్రోద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. అనంతరం కూడా న్యాయవాదులు చట్టాల అమలులో కీలకపాత్ర పోషిస్తూ సమాజాభివృద్ధికి తోడ్పడుతున్నారన్నారు. అయితే న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు ఏపీ బార్‌కౌన్సిల్‌లు తగిన చొరవ చూపడంలేదన్నారు. న్యాయవాదుల్లో 90 శాతం మంది అద్దె భవనాల్లో జీవిస్తున్నారని, ఇళ్ల స్థలాలను ఇవ్వాలని కోరారు. ఏపీ బార్ కౌన్సిల్ సీఓపీ రూల్స్‌ను సవరించాలన్నారు. ప్రతి న్యాయవాదికి ఇచ్చే రూ.5 లక్షలను రూ.20 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంను ఏపీ బార్ కౌన్సిల్ వారే చెల్లించి భార్యభర్తలకు ఎటువంటి అనారోగ్యం వచ్చినా ఎంత ఖర్చు వచ్చినా ఏపీ బార్ కౌన్సిల్ భరించాలన్నారు. ఏపీ బార్ కౌన్సిల్ ఎన్నిక సమయం ముగిసినా సకాలంలో ఎన్నికలు నిర్వహించకుండా కంటిన్యూ అవడం సరికాదన్నారు. ఏపీ బార్‌కౌన్సిల్ బైలా ప్రకారం గడువులోపు ఎలక్షన్ నిర్వహించాలన్నారు. చర్చావేదికలో ఉమ్మడి కడప జిల్లాలోని బార్ అసోసియేషన్ల అధ్యక్ష, కార్యదర్శులు, ఇతర నేతలు, పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య



వెంకటరామిరెడ్డి మృతదేహం

ఎర్రగుంట్ల, ఆగస్టు 3: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో రైలుకిందపడి లింగాల వెంకటరామిరెడ్డి (64) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రొద్దుటూరు నాగేంద్రనగర్ వాసిగా రైల్వే పోలీసులు తెలిపారు. కేసునమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కర్ణాటక పోలీసుల సోదాలు

సింహాద్రిపురం, ఆగస్టు 3: రావులకొలను గ్రామంలో శనివారం సెంట్రల్ సైబర్ క్రైమ్ కర్ణాటక పోలీసులు సోదాలు నిర్వహించారు. వివరాల్లోకెళితే... రావులకొలను వాసి నాగేశ్వర్‌రెడ్డిను సైబర్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిసింది. ఇన్వెస్టిగేషన్‌లో భాగంగా నాగేశ్వర్‌రెడ్డి ఇంట్లో సోదాలు నిర్వహించినట్లు తెలిసింది. వచ్చిన కర్ణాటక పోలీసులు విలేకరులకు సమాచారం ఇవ్వలేదు. ఫొటోలు తీయడానికి అనుమతించలేదు.

విద్యుత్ షాక్‌తో గేదెలు మృతి



మృతిచెందిన గేదెలు, దూడ

పులివెందుల టౌన్, ఆగస్టు 3: కె.వెలమవారిపల్లెలో విద్యుత్ షాక్‌తో మూడు గేదెలు, ఒక దూడ మృతిచెందాయి. శుక్రవారం మేతకోసం వెళ్లిన గేదెలు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు యజమాని ఓంప్రసాద్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశారు.

శివనాగిరెడ్డి ఆత్మహత్య కేసులో రామమోహన్‌రెడ్డి అరెస్టు



చెన్నూరు, ఆగస్టు 3: అవ వ హాన బా ర ం తో ఆత్మహత్య చేసుకున్న ఉప్పరపల్లె వాసి గాజులపల్లి శివనాగిరెడ్డి కేసులో నిందితుడు సానా రామమోహన్ రెడ్డిని శనివారం అరెస్టు చేసినట్లు సీఐ నారాయ ణయాదవ్ తెలిపారు. ఎస్పీ పర్యవేక్షణలో కడప డీఎస్పీ ఆధ్వర్యంలో ఇర్కాన్ సర్కిల్ వద్ద అతన్ని అరెస్టు చేసి రూ.7వేల డబ్బు, ఫోన్‌పే లావాదేవీల జిరాక్స్ కాపీలు, మూడు ప్రామిసరీ నోట్ బ్యాండ్లు స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గుర్రంకొండ, ఆగస్టు 3: నడిచి వెళుతున్న చంద్రశేఖర్ రెడ్డి(53)ని వెనుక నుంచి లారీ ఢీకొంది. చెర్లోపల్లె పంచాయతీ తొట్లివారిపల్లె వాసి చంద్రశేఖర్‌రెడ్డి నర్సరీతో జీవిస్తున్నాడు. శనివారం ఇంటి నుంచి నర్సరీ వద్దకు వెళుతుండగా రాయచోటి వైపు వెళుతున్న లారీ ఢీకొనడంతో అతని కాలు, తలకు తీవ్ర రక్తగాయమైంది. బాధితుడిని చికిత్స కోసం బెంగుళూరుకు తరలించగా ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

పలువురు సీఐల బదిలీ

కడప (క్రైం), ఆగస్టు 3: జిల్లాలో పనిచేస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. కడప ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డిని కడప రిమ్స్‌కు బదిలీ చేశారు. ఆర్కే వ్యాలీలో పనిచేస్తున్న గోవిందరెడ్డిని ప్రొద్దుటూరు అరన్స్‌కు వేంపల్లెలో పనిచేస్తున్న చాంద్‌బాషాను కడప వీఆర్‌కు బదిలీ చేశారు. బదిలీ అయిన అధికారులు తక్షణమే బాధ్యతలు స్వీకరించాలని ఆదేశాలు జారీ చేశారు.

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు పొందండి

వైవీయూలో వెబ్ ఆప్షన్లు ప్రారంభం

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 3: వైవీయూ డిగ్రీ కోర్సుల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకుని ప్రవేశాలు పొందాలని ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మి ప్రసాద్ తెలిపారు. డిగ్రీ ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆన్‌లైన్ అడ్మిషన్ మాడ్యుల్ ఫర్ డిగ్రీ కాలేజెస్ వెబ్‌ఆప్షన్ మొదలైందన్నారు. ఈ నెల 5వరకు కొనసాగుతుందన్నారు. జాతీయ స్థాయిలో గుర్తింపు కలిగిన వైవీయూ నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. విదేశీ విశ్వవిద్యాలయాల్లో పరిశోధన సంస్థల్లో పనిచేసిన అనుభవం కలిగిన ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లతో బోధన ఉంటుందని స్పష్టం చేశారు. విద్యార్థులు అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా

ఎర్రగుంట్ల, ఆగస్టు 3: ఆర్టీపీపీలో కాంట్రాక్టు కార్మికుడు క్రేన్ కిందపడి మృతిచెందిన అక్బర్‌బాషా(50) కుటుంబానికి న్యాయం చేయాలని ఆర్టీపీపీ మెయిన్ గేటు వద్ద శనివారం కార్మిక సంఘాలు మృతుని కుటుంబంతో కలిసి ధర్నా చేపట్టాయి. విధినిర్వహణలో చనిపోతే ఇచ్చే రూ.10లక్షలు, క్రేన్ థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, ఇతర బెనిఫిట్స్ ఇచ్చేందుకు అంగీకరించినట్లు కార్మిక నేతలు తెలిపారు. అధికారులంతా కలిసి రూ.8లక్షలు ఇచ్చేందుకు అంగీరించినట్లు ఎస్‌ఈలు, సీఈ ఉమాపతి ఆధ్వర్యంలో జరిగిన చర్చల్లో అంగీకరించినట్లు సమాచారం. శనివారం సాయంత్రానికి రూ.5లక్షలు, సోమవారం రూ.3 లక్షలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అలాగే కుటుంబంలో ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగం కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. దీంతో ఆందోళన విరమించారు.

శాశ్వత నీటి పరిష్కారమే లక్ష్యం

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు3: నియోజకవర్గంలో శాశ్వత నీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గ ప్రజలు నీటి సమస్యతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నీటి సమస్య పూర్తిగా నివారించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు నీటి సమస్య ఉన్న గ్రామాల్లో దాదాపు 15 బోర్లు వేశామన్నారు. అవసరమైన ప్రతి గ్రామంలో బోర్లు వేసి నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. ఈ క్రమంలోనే శనివారం గాలివీడు మండలం ఎగువగొట్టివీడు గ్రామం నాగన్నగుట్టపాలెంలో బోరు వేశామన్నారు. ఈ బోరు నుంచి గ్రామానికి నీటి సరఫరా చేసి సమస్య పరిష్కరిస్తామన్నారు. గ్రామంలో నెలకొన్న నీటి సమస్య పరిష్కారం కాబోతుండడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.


సుగాలిబిడికిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు


నూలివీడులో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న సీడీపీవో పద్మావతి


గాంధీనగర్ ఎస్టీకాలనీలో అంగన్వాడీ చిన్నారులు తల్లులతో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ సిబ్బంది


రైల్వేకోడూరు లో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ముర్రుపాలు బిడ్డకు అమృతతుల్యం

రామాపురం, ఆగస్టు 3: బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని సీడీపీవో వై. పద్మావతి అన్నారు. మండలంలోని గువ్వలచెరువు క్లస్టర్ పరిధిలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ సుగాలి బిడికిలో శనివారం అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడుతూ బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు బిడ్డకు పట్టడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పాలు పట్టే విషయంపై గర్భిణులకు, బాలింతలకు ఆమె అవగాహన కల్పించారు. శిశువుకు తల్లిపాలు పట్టడం వలన ఇన్‌ఫెక్షన్ రాకుండా నిరోధిస్తుందని, శిశు మరణాలు తగ్గుతాయన్నారు. ప్రతి ఏడాది ఆగస్టు 1వ తేదీ, 7వ తేదీ, మొదటి వారంలోపు ప్రతి అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తారన్నారు. అంగన్వాడీ సూపర్‌వైజర్లు హాస్సేనమ్మ, తులసమ్మ, పద్మజారాణి, సుజాతరెడ్డి, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గాలివీడు: మండలంలోని నూలివీడు సెక్టార్‌లో సీడీపీవో పద్మావతి మాట్లాడారు. బాలింతలు, గర్భిణులకు పాలు, గుడ్లను పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, అంగన్వాడీ టీచర్ లక్ష్మీదేవి, సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: రెడ్డివారిపల్లెలో దేవలంపల్లె వైద్యాధికారిని నజియా మోహాబ్, సీహెచ్‌ఓ శివకుమార్, సిబ్బంది పుష్పలత, అంగన్ వాడీ వర్కర్ పిల్లల తల్లులు పాల్గొన్నారు

రైల్వేకోడూరు: సీడీపీవో పి. సౌభాగ్యమ్మ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్లు కే. యశోద, అంగన్వాడీ కార్యకర్తలు ఎస్. లీలాజ్యోతి, మునిరత్న, శిరీషా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రాజంపేట టౌన్: రాజంపేటలో అంగన్వాడీ సూపర్‌వైజర్ రాణి తల్లులకు, బాలింతలకు, బాలికలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. కార్యకర్తలు ప్రతిమ, నాగలక్ష్మి, సుభద్ర, రాజేశ్వరి, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.


తల్లిపాల వారోత్సవాల్లో అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది

పెనగలూరు: గాంధీనగర్ ఎస్టీ కాలనీలో అంగన్వాడీ కార్యకర్త అంజలి అధ్యక్షతన నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో పెనగలూరు సెక్టార్ సూపర్‌వైజర్ విజయకుమారి మాట్లాడారు. గ్రామంలో తల్లులతో పాటు అంగన్వాడీ చిన్నారులు ర్యాలీ నిర్వహించారు. ఆశా కార్యకర్త సుమతి, ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

నందలూరు: అరవపల్లె అంగన్వాడీ కేంద్రంలో టీడీపీ రాష్ట్ర బీసీ నాయకులు తాటి సుబ్బరాయుడు, ఎంఎల్‌హెచ్‌పీ మల్లీశ్వరి, పీహెచ్ఎన్ శైలజా, అంగన్వాడీ టీచర్ విజయలక్ష్మి, ఆయా లలిత, తల్లులు, బిడ్డలు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల సమస్యలు పరిష్కరిస్తాం

రైల్వేకోడూరు, ఆగస్టు 3: ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమస్యలను పరిష్కరిస్తామని టీడీపీ రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. శనివారం రైల్వేకోడూరు మండలం కె. బుడుగుంటపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాల పరిస్థితులు, సమస్యలు, విద్యార్థుల ఉత్తీర్ణత తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల నుంచి వినతి పత్రం అందుకున్నారు. కళాశాల అభివృద్ధి కోసం పాటుపడతానని తెలిపారు. అనంతరం రూపానందరెడ్డిని విద్యార్థులు, కళాశాల ప్రిన్సిపాల్ యం. భాస్కర్‌రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సుబ్బరామిరెడ్డి, శేఖర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కూటమి ప్రభుత్వం లక్ష్యం

● ఎమ్మెల్యే అరవ శ్రీధర్


నిత్యావసర వస్తువులు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

రైల్వేకోడూరు, ఆగస్టు 3: ప్రజా సంక్షేమం కూటమి ప్రభుత్వం లక్ష్యమని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. శనివారం రైల్వేకోడూరు పట్టణం కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు విక్రయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని పీఎంఆర్ కాంప్లెక్స్ ఎదురుగా కిలో కంది పప్పు రూ. 160లు, కిలో బియ్యం రూ. 49లకు విక్రయిస్తారన్నారు. ప్రభుత్వం ఈ రెండు నిత్యావసర వస్తువులను తక్కువ ధరకు విక్రయించే ఏర్పాటు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక సంక్షేమ కార్యక్రమాలు వేగవంతంగా సాగుతున్నాయన్నారు. అధిక ధరలకు నిత్యావసరాలను అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. రైల్వేకోడూరు కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మండల రామకృష్ణ, ఉపాధ్యక్షుడు మేడా వెంకట సుబ్బయ్య, జనసేన నాయకులు పగడాల వెంకటేష్, పగడాల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మాతమ్మ తిరుణాల

పుల్లంపేట: పీవీజీపల్లె పంచాయతీ కొల్లంపల్లె అరుంధతి వాడలో శనివారం నిర్వహించిన మాతమ్మ జాతర సందర్భంగా రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు వారిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ రామ చంద్రనాయుడు, మండల అధ్యక్షుడు ఆరె సుధాకర్‌నాయుడు, పోలూరు కృష్ణమనాయుడు, సింగం ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

రాజంపేట, ఆగస్టు 3 : రాజంపేట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం రాజంపేట పట్టణంలోని పాత బస్టాండులో అన్నదానం చేశారు. పెద్దిరెడ్డి ప్రియదర్శన్ రెడ్డి జన్మదినం సందర్భంగా లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు ఆరె వెంకటసుబ్బయ్య ఈ కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నరసింహారావు, మన్నూరు సుబ్బరామిరెడ్డి, గూడూరు దిలీప్‌కుమార్‌రాజు, సంతోష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుగవాసి జన్మ దినోత్సవం



రాజంపేటలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద సుగవాసి బాలసుబ్రమణ్యంకు జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నేతలు, కేక్ కట్ చేస్తున్న సుగవాసి

రాజంపేట టౌన్, ఆగస్టు 1 : నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం 54వ జన్మదినోత్సవం సందర్భంగా శనివారం రాజంపేటతో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వేడుకలు నిర్వహించారు. భారీ కాన్వాయ్‌తో రాజంపేటకు చేరుకున్న ఆయనకు మన్నూరు యల్లమ్మ ఆలయం వద్ద, మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి ఆధ్వర్యంలో ఆర్ అండ్ బీ వద్ద టీడీపీ కేకలు కట్‌చేశారు. ర్యాలీగా ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకుని పూలమాలలు వేసి కేక్‌ను కట్‌చేసి శాలువాలు కప్పి వేడుకలు నిర్వహించారు. ఆర్ఎస్ రోడ్డు మీదుగా టీడీపీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ కార్యకర్తలకు, నాయకులకు, పేదలకు విందు ఏర్పాటు చేశారు. రాజంపేట టీడీపీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యానాయుడు, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్‌వి రమణ, రాజంపేట పార్లమెంట్ లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, మాజీ పట్టణ అధ్యక్షుడు సంజీవరావు, గంప శివ, మాజీ అత్తిరాల దేవస్థానం చైర్మన్ బండారు బాలయ్య, సీనియర్ టీడీపీ నాయకులు, మండల టీడీపీ మాజీ అధ్యక్షులు బాపనయ్యానాయుడు, సుబ్రమణ్యం నాయుడు, మాజీ ఉపాధ్యక్షులు నాగా సుధాకర్‌రెడ్డి, ఊటుకూరు నాయకులు హరిరాయల్, చెంగల్‌రాయుడు, మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి, వెంకటేశ్వర్లు, ఊటుకూరు మాజీ సర్పంచ్ ఎంఎల్ నారాయణ, ఎంఎల్ నరసయ్య, ప్రముఖ రియల్టర్ కావుటూరు సుబ్రమణ్యం నాయుడు (మణి), కావుటూరి ఆదినారాయణ, పోలి నాయకులు చంద్ర, భువనగిరిపల్లె ఆలయ ధర్మకర్త టైల్స్ నరసింహ, మండల టీడీపీ నాయకులు మేకా నరసింహులు, సాయినగర్ నాయకులు రవి, మాజీ కౌన్సిలర్ వెంకట సుబ్బయ్య, సుధాకర్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ యెద్దల విజయసాగర్, దంత వైద్యుడు డాక్టర్ నవీన్, సీనియర్ టీడీపీ నాయకులు మలిశెట్టి సుబ్బరాయుడు, సుదర్శన్ థియేటర్ ఎండీ అదృష్టదీపుడు, కొల్లావారిపల్లె నాయకులు నాగేశ్వర్‌నాయుడు, మాజీ ఎంపీటీసీ గుడారు సుబ్రమణ్యం, గుడారు చందు, బొబ్బిలిరాయుడు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం: టీడీపీ కార్యాలయంలో చెంచయ్యనాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. పూజలు నిర్వహించారు.

సుండుపల్లె: సుండుపల్లె టీడీపీ కార్యాలయంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్‌చేశారు. ఎంపీపీ రాజమ్మ, నాయకులు వెంకటేశ్వర్లునాయుడు, శివకుమార్‌నాయుడు, సుబ్బయ్య, జనసేన మహిళా నాయకురాలు రెడ్డిరాణి పాల్గొన్నారు.

వీరబల్లి: శ్రీధర్‌రెడ్డి స్వగృహంలో కేక్ కట్ చేసి శ్రీధర్‌రెడ్డి, తాటిగుట్ల సురేంద్రారెడ్డి, రెడ్డెప్పరెడ్డిలు శాలువా, పూలమొక్క అందజేసి బాలసుబ్రమణ్యంను సత్కరించారు. పద్మనాభరెడ్డి, రాంమోహన్‌రెడ్డి, నేతి ఆంజనేయులు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి రాయవెంకటేష్, దొరబాబు, గుదే నాగార్జున, తుమ్మల రమేశ్, దుర్గం ఆంజనేయులు, నాగసుబ్బయ్య, రాయవెంకట్రమణ, వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట: స్థానిక ఏకశిల హోటల్ వద్ద సుగవాసి బాలసుబ్రమణ్యం కేక్ కట్‌చేశారు. కొత్త మాధవరంలో నామాల వెంకటయ్య ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు కేక్ కట్‌చేశారు. నడివీధి గంగమ్మను, కోదండరాముని దర్శించుకున్నారు. రమణ, బొబ్బిలి రాయుడు, చింత రాజుపల్లె రమణ, ఎంపీటీసీ సుభాన్‌బాషా, అంగడాల వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నందలూరు, : రాజంపేట వ్యవసాయమార్కెట్ కమిటి మాజీ చైర్మన్ యెద్దల విజయసాగర్, మాజీ జడ్పీటీసీ యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, చామంచి పెంచలయ్య, ఉప్పుశెట్టి మౌలా, మాబాషా తదితరులు పాల్గొన్నారు.

సుగవాసి ఫ్లెక్సీల చించివేత

ఒంటిమిట్ట: సుగవాసి జన్మదినోత్సవం సందర్భంగా మండలంలోని కోదండ రామాలయం వెనుకభాగంలో టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చించివేయడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. ఇందుకు కారణం టీడీపీలోని వర్గ విభేదాలా? లేక వైసీపీ నాయకులు, ఆకతాయిలా అన్న అంశం చర్చనీయాంశంగా మారింది. ప్రాథమికంగా ఓ జిల్లా నాయకుడి ఫొటో వ్యవహారమే ఇందుకు కారణమన్న చర్చ కొనసాగుతోంది. ఆలయం వెనుకభాగంలో సీసీ కెమెరాలు ఉండడంతో వాటి ఫుటేజీని పరిశీలించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. తమకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని, ఫిర్యాదు చేస్తే చించివేసిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట, ఆగస్టు 3: రాజంపేట మండలంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎం.గీత ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశానికి ఈనెల 16 లోపు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో జిల్లాలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఉమ్మడి కడపజిల్లా విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నామినేటెడ్ పోస్టు కోసం దరఖాస్తు


రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడితో పెనగలూరు టీడీపీ నాయకులు

పెనగలూరు, ఆగస్టు 3 : తనకు నామినేటెడ్ పోస్టు ఇవ్వాలంటూ రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొత్త బాలకృష్ణ తెలిపారు. శనివారం అమరావతిలో ఆయనను కలిసి 20 ఏళ్లుగా తాను పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ మండలస్థాయి అధ్యక్షుడిగా, ఎంపీటీసీగాను, ప్రస్తుతం జిల్లా అధికార ప్రతినిధిగాను పనిచేస్తున్నానని ఆయన తెలిపారు. జిల్లాస్థాయిలో కాని, రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పోస్టు ఇచ్చి తన శ్రమకు గుర్తింపును ఇవ్వాలని కోరినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు పార్లమెంట్ తెలుగుయువత ఉపాధ్యక్షుడు నాగినేని రాంప్రసాద్‌నాయుడు, మండల బీసీ సంఘం నాయకులు వై.హరిప్రసాద్ కూడా ఉన్నారని ఆయన తెలిపారు.

పాలిటెక్నిక్ కళాశాలలో వసతులు కల్పించాలి

ఓబులవారిపల్లె, ఆగస్టు 3 : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపల్‌ను నియమించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగించాలని, ప్రహరీ గోడ నిర్మించాలని, రెగ్యులర్ ఫ్యాకల్టీని నియమించాలని కోరారు. పాలికెట్నికల్ కళాశాల అనుబంధంగా హాస్టల్ ఏర్పాటు చేయాలన్నారు. కాలేజీలో డిమాండ్ ఉన్న బ్రాంచ్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమణ, ఎస్ఎఫ్ఐ నాయకులు సూరివర్ధన్, చక్రి, ప్రసాద్, శ్రీనివాసులు, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

నందలూరు, ఆగస్టు 3 : అడవిలో తప్పిపోయిన వ్యక్తిని కాపాడి కుటుంబ సభ్యులకు అప్పజెప్పినట్లు ఎస్ఐ మహ్మద్ అబ్దుల్‌జహీర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ నారాయణ నెల్లూరుకు చెందిన తోట హరిబాబు ఈనెల 2న సౌమ్యనాథస్వామి ఆలయానికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్లకపోవడంతో బంధువులు శనివారం ఫిర్యాదు చేశారన్నారు. తనతోపాటు దిలీప్, రవితేజ వెళ్లి గాలించగా ఈదరపల్లె గ్రామ శివారుల్లో హరిబాబుకు చెందిన మోటారుసైకిల్ కనిపించిందని, అక్కడికి సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న అడవిలో హరిబాబును గుర్తించి స్థానిక పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించడం జరిగిందన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

● రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు3: జర్నలిస్టుల ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏపీయూడబ్ల్యూజే అన్నమయ్య జిల్లా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు గౌనిపల్లె శ్రీనివాసులు, రమేశ్‌కుమార్‌రాజు, ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య తదితరులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి జర్నలిస్టుల సమస్యలు విన్నవించారు. కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు రమేశ్‌కుమార్ రాజు, ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులకు మంచి జరిగేలా ప్రయత్నం చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే గౌరవ సలహాదారుడు కొండూరు వెంకట్రామరాజు, ఉపాధ్యక్షుడు పల్లం చందు, సంఘం సభ్యుడు రాంమోహన్, నగళ్లపాటి సూర్యప్రకాశ్‌రాజు, తిరుపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన హోంగార్డ్ కమాండెంట్

రాయచోటిటౌన్, ఆగస్టు 3: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని శనివారం కర్నూలు రేంజ్ హోంగార్డ్ కమాండెంట్ శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి హార్థిక శుభాకాంక్షలు తెలియజేశారు. కర్నూలు రేంజ్ పరిధిలో లా అండ్ ఆర్డర్ విషయంలో అవసరమైన సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు.


మంత్రి మండిపల్లికి శుభాకాంక్షలు తెలుపుతున్న కర్నూల్ రేంజ్ హోంగార్డ్ కమాండెంట్ శ్రీనివాసులు

పౌర సరఫరాల గోదాము తనిఖీ


గోదామును తనిఖీ చేస్తున్న ఆర్‌డీఓ రంగస్వామి

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 3: మండలంలోని పౌరసరఫరాల శాఖ గోదామును రాయచోటి ఆర్‌డీఓ రంగస్వామి శనివారం తనిఖీ చేశారు. టీడీ మల్లికార్జునబాబును అడిగి బియ్యం, పంచదార, నిల్వల వివరాలు తెలుసుకున్నారు. డీలర్లకు సరుకులు పంపిణీ చేసే ముందు తూకాలు వేసి ఇవ్వాలని ఆదేశించారు. సకాలంలో డీలర్లకు సరుకులు సరఫరా చేయాలని, 1వ తేదీ నుంచి లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేసేట్లు చూడాలన్నారు. పంపిణీలో అక్రమాలు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ హుసేన్ సాబ్, డీటీలు రెడ్డెన్న, రాజేంద్రరావు, ఆర్ఐ సమ్మత్‌ఖాన్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ 'ఉపాధి' కల్పించాలి


ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ, టీడీపీ నాయకులు

లక్కిరెడ్డిపల్లె ఆగస్టు 3: అర్హులైన ఎస్సీ కూలీలకు ఉపాధి హామీ పథకంలో చాలా అన్యాయం జరిగిందని, అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ అంకన్న, తెలుగు యువత అధ్యక్షుడు పక్కీరయ్య శనివారం స్థానిక ఎంపీడీవో వెంకటరామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. వెసీపీ కాలనీకి చెందిన 30 కుటుంబాలకు వైసీపీ ప్రభుత్వంలో అర్హులైన పనులు కల్పించడం లేదని వినతి పత్రంలో పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఫీల్డ్ అసిస్టెంట్ నకిలీ జాబ్‌కార్డులతో కోట్ల రూపాయలు కొల్లగొట్టారని, కువైట్‌లో ఉన్నవారికి 400పైగా బోగస్ జాబు కార్డులు పుట్టించి ప్రతి వారం కోట్ల రూపాయలు ఫీల్డు అసిస్టెంట్, ఉపాధి అధికారులు దోసుకున్నారని ఆరోపించారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కూలీలు గంగులమ్మ, సునీత, విష్ణు, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

వెలుగు ఉద్యోగిపై చర్యలు తీసుకోండి


ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

రైల్వేకోడూరు, ఆగస్టు 3: మత ప్రచారం చేస్తున్న వెలుగు ఉద్యోగిపై చర్యలు తీసుకోవా లని విశ్వహిందూ పరిషత్ నాయకుడు దరిశా వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఆ మేరకు శనివారం ఇన్‌ఛార్జి తహసీల్దార్ రెడి ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 17న మండలంలోని కె. బుడుగుంటపల్లె పంచాయతీ విద్యానగర్‌లో మత ప్రచారం చేస్తున్న వెలుగు ఉద్యోగిని అడ్డుకున్నట్లు తెలిపారు. ఆ ఉద్యోగిపై చర్యలు తీసుకోకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టి. సుబ్బరాయుడు ఆచారి, కాళప్పగారి రాము, మంకు రమణ, సాయం శ్రీధర్, వాకచర్ల సుబ్బారావు, శ్రీనివాసులు, దామోదర్, శివయ్య, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలసిన టీడీపీ నాయకులు


కేంద్ర మంత్రిని కలసిన సంగరాజు రవికుమార్‌రాజు

రైల్వేకోడూరు(రూరల్), ఆగస్టు 3: కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మను మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు సంగరాజు రవికుమార్‌రాజు శనివారం తిరుపతిలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఉద్యాన పరిశ్రమలు ఏర్పాటు చేయాలని విన్నవించామని తెలిపారు. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాల్లో అరటి, బొప్పాయి, మామిడి పంటలను రైతులు పండిస్తున్నారన్నారని, ఉద్యాన హబ్‌లు ఏర్పా టు చేయాలన్నారు. శీతల గిడ్డంగులు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కోడూరులో మూతపడిన అప్సా జ్యూస్ పరిశ్రమను తిరిగి ప్రారంభించాలని కోరామని తెలి పారు. శీతల గిడ్డంగులు ఉంటే రైతులు పండించిన పంటలను గిట్టుబాటు ధరలకు అమ్ముకు నే విధంగా వీలు ఉంటుందన్నారు. మంత్రిని కలసిన వారిలో క్షత్రియ నేతలు, బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగం నివారించాలి


ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చెత్తను సేకరిస్తున్న విద్యార్థులు, హెల్పింగ్‌హ్యాండ్స్ సభ్యులు

రాజంపేట టౌన్, ఆగస్టు 3 : ప్లాస్టిక్ వ్యర్థాల వినియో గాన్ని ప్రతిఒక్కరు బాధ్యతగా నివారించాలని ఇది అందరి బాధ్యత అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పురుషోత్తం తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్లాస్టిక్ వ్యర్థాల నివారణపై హెల్పింగ్ హ్యాండ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు వెంటనే భూమిలో కలవవని, దీనివల్ల అనేక అనర్థాలు ఏర్పడతాయని ఆయన తెలిపారు. ప్రతిఒక్కరు ప్లాస్టిక్ కవర్లు వాడకం పూర్తిగా మానేయాలని ఆయన కోరారు. అనంతరం హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు, విద్యార్థులు కలిసి కళాశాలలోని వ్యర్థాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్‌హ్యాండ్స్ సభ్యులు శివాజి, ఆర్టిస్టు మణి, నవీన్, రాఘవ, మురారి, హరి, కృష్ణారెడ్డి, సుబ్బారావు, నికేతన్, కళాశాల అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు


కొత్తపల్లి పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రాయచోటిటౌన్, ఆగస్టు3: స్థానిక కొత్తపల్లి ఎంపీయూపీ పాఠశాలలో శనివారం జిల్లా అంధత్వ నివారణ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ రియాజ్‌బేగ్ ఆధ్వర్యంలో 84 మంది వి ద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. దృష్టి లోపాలు ఉన్న ఆరుగురు విద్యార్థులను గుర్తించారు. నెల రోజుల్లోగా ఆయా విద్యార్థులకు అద్దాలు పంపిణీ చేస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు స్ర్కీనింగ్ క్యాంపులు నిర్వ హిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆప్తాల్మిక్ అసిస్టెంట్ విజయ, ఉపాధ్యా యులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పుల్లంపేట: విద్యార్థులందరూ తప్పనిసరిగా ముందు జాగ్రత్తగా కంటి పరీక్షలు చేయించుకోవాలని కంటి వైద్యులు డాక్టర్ ఓబులేసు తెలిపారు. స్కూల్ హెల్త్ ప్రోగ్రాం కింద శనివారం స్థానిక బీపీ శేషయ్య సంస్కృత ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆయన కంటి పరీక్షలు చేశారు. కళ్లను సున్నితంగా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే కంటి వైద్యుని సంపాదించాలన్నారు. విటమిన్ ఏ లోపం రాకుండా పౌష్టికాహారాన్ని తీసుకొని దృష్టిలోపం నివారించవచ్చునన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శేఖర్ పరిశీలించారు. డాక్టర్ మనోజ్‌చంద్ర, ప్రధానోపాధ్యాయులు మురళీ, ఉపాధ్యాయురాలు స్రవంతి, గౌసియా పాల్గొన్నారు.

నేడు మానవత ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం

లక్కిరెడ్డిపల్లె: స్థానిక నలంద హైస్కూల్లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వెంకటేశ్వర అరవింద కంటి ఆసుపత్రి తిరుపతి సహకారంతో కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు మానవతా సంస్థ చైర్మన్ బాలసుబ్రమణ్యం తెలిపారు. ఉచితంగా కంటిలో శుక్లము, దూరపుచూపు పరీక్షలు నిర్వహించి మందులు, ఉచితంగా అందజేస్తారని అలాగే కంటి ఆపరేషన్‌వారికి తిరుపతికి తీసుకెళ్లి ఆపరేషన్ చేయించి ఇంటికి చేరుస్తారని ఆయన తెలియజేశారు

ఉన్నత విద్యా ప్రమాణాల సాధనకు ప్రతినబూనాలి


ధర్మాచార్యుడు వెంకటరమణను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

రాజంపేట, ఆగస్టు 3 : ఉన్నత విద్యా ప్రమాణాల సాధన కోసం ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ధర్మాచార్యులు గంగన పల్లి వెంకటరమణ పిలుపునిచ్చారు. శనివారం రాజు ఉన్నత పాఠశాలలో ప్రదానో పాధ్యాయుడు రఘురాం రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కష్టపడి చదవాలన్నారు. తల్లిదండ్రులు, గురువులు చేసిన సూచనలను పాటించాలన్నారు. ఈ సందర్భంగా ధర్మాచార్యులు గంగనపల్లె వెంకటరమణను పాఠశాల తరపున ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు తేజ, సుబ్బారెడ్డి, హబీబ్, సునీత, నాగమణి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం ప్రత్యేకం

తిరుమల తిరుపతి దేవస్థానాల ఈవో అన్నది ఒక విశేషమైన హోదా. ఒక పవిత్రమైన బాధ్యత. ఐఏఎస్ కెరీర్‌లో అరుదైన అవకాశం. దేశం నలుమూలలనుంచీ వచ్చే భిన్న ప్రాంతాల, భిన్న భాషల, భిన్న ఆహారపు అలవాట్లున్న భక్తులకు అసౌకర్యం కలుగకుండా సంతృప్తికరంగా శ్రీవారి దర్శనం చేయించడం నిత్య సవాలు. తిరుమలలో చిన్న కదలిక కూడా జాతీయ వార్తగా వైరల్ అయిపోతుంది. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ సకల విభాగాల యంత్రాంగాలనూ నడిపించాలి. టీటీడీ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన జె.శ్యామలరావు నెలన్నరగా తిరుమల అంతా సుడిగాలిలా తిరిగారు. ప్రతిదీ ప్రత్యక్షంగా పరిశీలించి ఆనుపానులు తెలుసుకున్నారు. ఆ తర్వాతే సమీక్షలకు దిగి సరిదిద్దే చర్యలకు ఉపక్రమించారు. పరిశీలన, అవగాహన, గుర్తించిన లోపాలు, చేయబోయే మార్పుచేర్పుల గురించి ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా సంభాషించారు. అందులోని ముఖ్యాంశాలు....

- తిరుమల, ఆంధ్రజ్యోతి

■ ఇంటర్వ్యూ

టీటీడీకి పటిష్ఠమైన ఐటీ అవసరం



జె.శ్యామలరావు

1997 బ్యాచ్ ఐఏఎస్, సొంతూరు కాకినాడ. 11ఏళ్లు అసోంలో విధులు. 2009-11 మధ్య విశాఖ కలెక్టర్‌గా బాధ్యతలు. మెడికల్ కార్పొరేషన్, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్ బోర్డులకు ఎండీగా చేశారు. కమర్షియల్ టాక్స్ జీఎస్టీ కమిషనర్‌గానూ, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ కార్యదర్శిగానూ విధులు నిర్వహించారు. ఉన్నత విద్యాశాఖ నుంచి టీటీడీ ఈవోగా జూన్ 16న వచ్చారు.

- లడ్డూ, అన్నప్రసాదాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి
- క్యూలైన్లలో భక్తులకు అవస్థల్లేకుండా చర్యలు

వారాంతపు క్యూలైన్లపై ప్రత్యేక శ్రద్ధ

ఎక్కువమంది భక్తులు సంతృప్తికరంగా శ్రీవారిని దర్శించుకునేలా చేయడమే నా ప్రథమ ప్రాధాన్యం. ఎలాంటి ప్రణాళికలు లేకుండా వచ్చే భక్తులతోనే క్యూలైన్లు పెరిగిపోతున్నాయి. వారాంతపు క్యూలైన్లలో భక్తులు ఇబ్బందిపడకుండా నారాయణగిరిలో అదనపు షెడ్ నిర్మించాలని నిర్ణయించాం. ఇక్కడ 5నుంచి 6వేల మంది భక్తులు కూర్చోవచ్చు.ఆలయంలో సేవలు, కైంకర్యాల్లో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకుంటే అధిక సంఖ్యలో భక్తులకు దర్శనం కల్పించవచ్చని అర్థమయ్యింది. ఆధునిక టెక్నాలజీ వినియోగం ద్వారా క్యూలైన్లలో భక్తుల కదలికలను పరిశీలించి సంఖ్యను నియంత్రించవచ్చు. ఇక, భక్తులు అధిక సమయం క్యూలైన్‌లో నిలబడి ఇబ్బందిపడే అవసరం లేకుండా స్లాటెడ్ సర్వదర్శనం (ఎస్ఎస్‌డీ) టోకెన్లు వారానికి 1.47 లక్షలకు పెంచాం. దీనిని గతంలోలా 1.67 లక్షలకు పెంచుతాం. ఈవోగా బాధ్యతలు చేపట్టిన వెంటనే బయటకు వ్యాపించిన క్యూలైన్లను తనిఖీ చేసినప్పుడు చాలా లోపాలు కనిపించాయి. అక్కడ అందించే ఆహారపదార్థాల నాణ్యత బాగాలేదని, కనీసం తాగు నీరు ఇచ్చే వాళ్లు కూడా లేరని, సమస్య చెప్పుకుందామని చూస్తే అందుబాటులో ఏ అధికారీ లేరనే ఫిర్యాదులు వచ్చాయి. పిల్లలకు పాలు అందడం లేదని ఓ భక్తురాలు నా దగ్గరకు వచ్చి ఏడ్చింది. సీఎంగారు కూడా ఇవే సమస్యల మీద దృష్టి పెట్టమని చెప్పారు. అన్నప్రసాదాల వితరణకు ఓ పద్ధతి ప్రకారం వ్యవస్థ లేదని గుర్తించా. ఈ క్రమంలో బయటికి వ్యాపించిన క్యూలైన్లు, నారాయణగిరి షెడ్లలో నిరంతరాయంగా ఆహార పదార్థాలు అందించేందుకూ, అందేలా పర్యవేక్షించేందుకూ ప్రత్యేకంగా ముగ్గురు ఏఈవో స్థాయిల్లో అధికారులను మూడు షిఫ్టుల్లో ఉండేలా నియమించా. అలాగే బయట క్యూలైన్ మొత్తానికి కలిపి 3 శాశ్వత ఫుడ్‌కౌంటర్లు ఏర్పాటు చేశాం. వారాంతాల్లో పర్యవేక్షణకు ఎస్వీబీసీ సీఈవోకు అదనపు బాధ్యతలు అప్పగించాం. ఫుడ్ పెట్టడం లేదనే విమర్శలకు అవకాశం ఇవ్వకుండా ఎక్కడ, ఎప్పు డు ఫుడ్ అందించామనే సమాచారం తెలిసేలా జీపీఎస్ ఇనేబుల్ కెమెరాల ద్వారా తీసిన ఫొటోలు సోషల్‌మీడియాలో అప్‌లోడ్ చేసే వ్యవస్థను తీసుకువచ్చాం. బయటి క్యూలైన్ల వద్ద మరుగుదొడ్ల సమస్యను అధిగమించేందుకు మొత్తం ఆరు టాయిలెట్లు భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చాం.

పారిశుధ్య నిర్వహణ తీరు మారాలి

ప్రస్తుతం పారిశుధ్య నిర్వహణ సంతృప్తికరంగా లేదు. కాంట్రాక్టర్లు సరిపడినంతమంది సిబ్బందిని పెట్టడం లేదు, కావాల్సిన మెటీరియల్ ఇవ్వడం లేదు. పనితీరుపై పర్యవేక్షణ ఇప్పటి వరకు లేకుండా పోయింది. ఈ పరిస్థితులు గమనించి మార్పులు చేస్తున్నాం. మొహమాటాలకు తావులేదు.పారిశుధ్యం సరిగా లేకపోతే కాంట్రాక్టు రద్దుచేస్తామని హెచ్చరిస్తున్నాం.

మరింత శుద్ధజలం

తిరుమలలో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల నిషేధం తర్వాత చాలా మంది భక్తులు జలప్రసాద కేంద్రాలపై ఆధారపడుతున్నారు.ఎప్పటికప్పుడు జలప్రసాద కేంద్రాల నుంచి శాంపిల్స్ తీసుకుని పరీక్షిస్తున్నాం.అలాగే గాజుబాటిళ్ల విక్రయంలో దుకాణదారుల తీరుపై వస్తున్న విమర్శలు పరిశీలించి హెచ్చరించాం. నిబంధనలను ఉల్లంఘిస్తే దుకాణాలను సీజ్ చేస్తాం. నీటి సరఫరాకు ప్రముఖ సంస్థలను కూడా ఆహ్వానిస్తున్నాం. ప్రస్తుత ధరకే విక్రయించేందుకు ముందుకు వస్తే లైసెన్సులను పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తాం.

కాలినడక భక్తులకు టోకెన్లు

గతంలో అలిపిరి, శ్రీవారిమెట్టు మార్గాల్లో నడిచివచ్చే భక్తులకు ప్రత్యేకంగా దివ్యదర్శనం టోకెన్లు ఇచ్చేవాళ్లు. అయితే వాటిని తొలగించారు. నేను వచ్చాక శ్రీవారిమెట్టులో తిరిగి టోకెన్లు జారీ చేస్తున్నాం. అలిపిరి మార్గంలో కూడా ఇవ్వాలంటూ చాలామంది అడుగుతున్నారు. అయితే ఇప్పటికే చాలా రకాల దర్శనాలు అమల్లో ఉన్నాయి. ఈ క్రమంలో వీటి జారీ వల్ల ఏదైనా సమస్య వస్తుందా అనే అంశాన్ని పరిశీలిస్తున్నాం. ఆలయ క్యూలైన్ల నిర్వహణ ఓ కొలిక్కి వచ్చిన తర్వాత ఈ మార్గంలో టోకెన్ల జారీపై దృష్టిపెడతాం. స్థానికులకు దర్శనం కల్పించడంపై కూడా త్వరలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

ఆర్గానిక్ నైవేద్యాల రుచిపై ఫిర్యాదులు

శ్రీవారికి నివేదించే నైవేద్యాలను ప్రకృతి వ్యవసాయం ద్వారా వచ్చే ముడి సరుకులతో సమర్పించాలని గతంలో నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈ ప్రసాదాలు రుచికరంగా లేవనే ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై కూడా చర్చించాం. అసలు టీటీడీకి అందుతున్నవి ఆర్గానిక్ ముడిసరుకులేనా కాదా, వాటి నాణ్యత ఎలా ఉందని పరీక్షించేందుకు ల్యాబ్‌కు పంపే ఏర్పాట్లు చేస్తున్నాం. కుకింగ్‌లో మార్పులు తీసుకురావాలనే సూచనలు వచ్చాయి. పరిశీలిస్తున్నాం.

అన్నదానంలో మోడరన్ కిచెన్

అన్నప్రసాదాల్లోని అన్నం ముద్ద కడుతోందని, బియ్యంలో నూకలు కలుస్తున్నాయని చాలా ఫిర్యాదులున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఇటీవల ఏపీ, తెలంగాణ రైస్ మిల్లర్ల అసోసియేషన్ సభ్యులతో సమీక్ష నిర్వహించాం. నాణ్యత పర్యవేక్షణకు ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచన చేశాం. అసోసియేషన్ నుంచి ఒకరు,టీటీడీ అన్నప్రసాద విభాగం నుంచి ఒకరు, కొనుగోళ్ల విభాగం నుంచి మరొకరు బియ్యం నాణ్యతను నిత్యం పరిశీలిస్తారు. నాణ్యత లేదని స్పష్టమైతే ఆ బియ్యం ఏ రైస్‌మిల్ నుంచి వచ్చిందో గుర్తించి ఆ మిల్లర్‌పై అసోసియేషన్ నిషేధం విధించాలని కోరాం. దానికి అసోసియేషన్ సభ్యులు కూడా అంగీకరించారు. అలాగే వెంగమాంబ అన్నప్రసాద భవనంలో భక్తులకు సంతృప్తికరంగా నాణ్యమైన, రుచికరమైన, పరిశుభ్రమైన వాతావరణంలో అన్నప్రసాదాలు అందించేందుకు అతిపెద్ద క్యాటరింగ్ సర్వీస్ సంస్థ 'కాంపస్' సహకారం తీసుకోబోతున్నాం. స్టోర్, కిచెన్, పారిశుధ్యం, సర్వింగ్, ట్రాన్స్‌పోర్టు ఇలా అన్నిటిలోనూ వాళ్లు కొన్ని సూచనలు చేస్తారు. వీళ్లు ఉచితంగానే ఈ సేవలను టీటీడీకి అందించబోతున్నారు. అన్నప్రసాదాల నాణ్యత పెంపుకోసం ఫుడ్‌టెక్నాలజీ, హోటల్ మెనేజ్‌మెంట్, క్యాటరింగ్ నిపుణులతో కూడా చర్చించాం.వంటశాలలో ఉన్న పాత యంత్రాలను తొలగించి అత్యాధునిక యంత్రాలు ఏర్పాటు చేస్తాం. సిబ్బందిని కూడా సరిపడా పెంచుతాం. రానున్న 25 ఏళ్ల వెనక్కి తిరిగి చూసే అవకాశం లేకుండా ఆధునాతన కిచెన్‌ను సిద్ధం చేస్తాం.

ఐటీ విభాగం వీక్

దర్శనం, వసతి, ఆర్జితసేవల ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థ తీరును పరిశీలిస్తున్నాం. ముఖ్యమైన ఐటీ విభాగం చాలా బలహీనంగా ఉంది. ఐటీలోని లోపాలను అవకాశంగా మార్చుకుని ఒకే మొబైల్, ఈమెయిల్ ద్వారా వందల సంఖ్యలో లక్కీడిప్ కోసం రిజిస్ట్రేషన్లు చేసుకోవడాన్ని గమనించాం. వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు చేసుకుని దర్శనాలు, సేవలు పొందుతున్నారు. అలాగే నకిలీ ఆధార్ నెంబర్లతోనూ టికెట్లు, గదులు తీసుకుంటున్నారు. శ్రీవాణి టికెట్లు కూడా ఫేక్ ఐడీలతో బుక్ చేస్తున్నారు. ఇప్పటికే పలు ఫోన్‌నెంబర్లను, మెయిల్స్‌ను బ్లాక్ చేయడంతో పాటు ఫేక్ ఆధార్ నెంబర్లతో, ఒకే నెంబరు, మెయిళ్ల ద్వారా చేసుకున్న కొన్ని బుకింగ్స్‌ను రద్దు చేశాం. ఇక, ఫేక్ ఆధార్‌లను అరికట్టేందుకు ఆధార్ సంస్థ ప్రతినిధులతో కూడా మాట్లాడాం. ప్రత్యేకంగా తయారు చేసిన అప్లికేషన్‌తో ఆధార్ నిజమైనదా కాదా అని నిర్ధారించుకునే వ్యవస్థను మరో 20 రోజుల్లో ఏర్పాటు చేయబోతున్నాం. ఐడీని మార్చడం పెద్ద క్రైం. ఎట్టిపరిస్థితిలో వీళ్లను విడిచిపెట్టకూడదు. భవిష్యత్తులో ఐటీ విభాగాన్ని పటిష్టం చేసి అక్రమాలకు అవకాశం లేకుండా చేస్తాం. అనుభవం కలిగిన మంచి అధికారి పర్యవేక్షణలోకి ఐటీ విభాగాన్ని తీసుకురాబోతున్నాం. ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీలో దళారీలను అరికట్టేందుకు ఫొటోతో టోకెన్ ఇచ్చే విధానాన్ని కూడా అమలుచేస్తున్నాం.

లడ్డూకి పూర్వ వైభవం: లడ్డూ నాణ్యత పెంపుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. పోటు కార్మికులు, అధికారులు, గతంలో పనిచేసి వెళ్లిన అధికారులతో సమీక్షలు నిర్వహించాం. లడ్డూ తయారీలో ముఖ్యమైనది నెయ్యి. రుచి, సువాసన రావాలంటే నాణ్యమైన నెయ్యి ఉండాలి. గతంలోకన్నా ఇప్పుడు వాడుతున్న నెయ్యి నాణ్యతలో లేడావుందని గుర్తించాం. ఇకపై క్వాలిటీ నెయ్యి రావాలని సంబంధిత టెండరుదారులను హెచ్చరించాం. కల్తీ నెయ్యిని సరఫరా చేస్తున్న ఓ సంస్థపై నిషేధం విధించాం. అత్యున్నత ప్రమాణాలతో ప్రత్యేకమైన ల్యాబ్‌ను తిరుమలలోనే ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తున్న ముడిసరుకుల నాణ్యతను పరిశీలిస్తాం. మంచి నాణ్యమైన సరుకులు వినియోగించడం ద్వారా లడ్డూకి పూర్వవైభవం తీసుకురావచ్చు.

పలమనేరు సీఐ తీరుపై టీడీపీ నిరసన

- స్టేషన్ ముందు ధర్నా
- జాతీయ రహదారిపై రాస్తారోకో





జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేస్తున్న టీడీపీ నాయకులు, సీఐ చంద్రశేఖర్‌ను నిలదీస్తున్న టీడీపీ నాయకులు

పలమనేరు, ఆగస్టు3 : పలమనేరు సీఐ చంద్రశేఖర్ తీరును నిరసిస్తూ శనివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు పోలీసు స్టేషన్ ముందు బైఠాయించారు. సీఐ చంద్రశేఖర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శనివారం ఉదయం పలమనేరు మండలం కూర్మాయి వద్ద కౌండిన్య నదిలో ముడివారిపల్లికి చెందిన పెద్దబ్బ గృహ అవసరాలకోసం రెండు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా సీఐ చంద్రశేఖర్ ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని ఎస్ఈబీ అధికారులకు అప్పగించారు. ఎస్ఈబీ అధికారులు ఆ ట్రాక్టర్లను పలమనేరు ఆర్టీసీ డిపో ఆవరణలో ఉంచారు. విషయం తెలుసుకొన్న పెద్దబ్బ పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పలమనేరు స్టేషన్ ముందు బైఠాయించారు. సీఐ చంద్రశేఖర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గంగవరం సీఐ చిన్న గోవిందు, గంగవరం రూరల్ సీఐ కృష్ణమోహన్ ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో అక్రమార్కులపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఇప్పుడు తాము ఇళ్ల కోసం ఇసుక తరలిస్తున్నా అడ్డుకోవడం తగదన్నారు. పోలీసులు స్పందించక పోవడంతో జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకోకు దిగారు. ఫలితంగా జాతీయ రహదారిపై ఇరువైపులా, మరోవైపు బస్టాండు నుంచి బస్సులు వెలుపలికి రాలేక నిలిచిపోయాయి. గంట పాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. చివరకు పోలీసులు ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులను స్టేషన్ వద్దకు పిలిపించారు. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి సీఐ చంద్రశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని గంగవరం, గంగవరం రూరల్ సీఐలు చిన్నగోవిందు, కృష్ణమోహన్‌లకు వినతి పత్రం అందజేశారు. ట్రాక్టర్లను విడిచిపెట్టాలని కోరడంతో ఇసుక ట్రాక్టర్లను, ట్రాక్టర్ డ్రైవర్లను వదిలేశారు. దీంతో నాయకులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కిషోర్‌గౌడు, సోమశేఖర్‌గౌడు, నాగరాజ రెడ్డి, నాగరాజు, ఖాజాపీర్, బాలాజినాయుడు, జగదీష్‌నాయుడు, సెల్వరాజ్, రామచంద్రనాయుడు, వెంకటమునిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి బాధితులు ఫిర్యాదు చేస్తే న్యాయం చేస్తాం

- మంత్రి రాంప్రసాద్ హామీ

చిత్తూరు సిటీ, ఆగస్టు 3: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వల్ల నష్టపోయిన బాధితులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే న్యాయం చేసేందుకు కృషి చేస్తామని మంత్రి రాంప్రసాద్ హామీ ఇచ్చారు. శనివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ పెద్దిరెడ్డి కుటుంబం వల్ల చాలా మంది వారి విలువైన భూములు పోగొట్టుకున్నారన్నారు. పుంగనూరు, పీలేరు, మదనపల్లెలో పర్యటిస్తుంటే అనేక ఫిర్యాదులు అందుతున్నాయని, ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చని, వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో పార్టీ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్ రాజన్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా బాబు, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కఠారి హేమలత, నేతలు కాజూరు బాలాజీ, త్యాగరాజన్, వసంత్‌కుమార్, మోహన్‌రాజ్, జయచంద్రనాయుడు, మాపాక్షి వెంకటేష్ పాల్గొన్నారు.

తహసీల్దార్ల బదిలీల్లో మార్పులు..చేర్పులు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 3: తహసీల్దార్ల బదిలీల్లో శనివారం మార్పులు చేర్పులు చోటుచేసుకున్నాయి. కేటాయించిన మండలాల్లో చేరేందుకు కొందరు విముఖత చూపగా, మరికొందరి నియామకాలను స్థానిక ప్రజాప్రతినిధులు వ్యతిరేకించడంతో పునఃబదిలీలు చేస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. శాంతిపురం తహసీల్దార్‌గా నియమితులైన కె.అమరనాథ్‌ను అన్నమయ్య జిల్లాకు కేటాయించారు.అన్నమయ్య జిల్లానుంచి చిత్తూరు జిల్లాకు బదిలీపై వచ్చిన జె.రామును పుంగనూరు తహసీల్దార్‌గా నియమించారు. అక్కడ పనిచేస్తున్న జి.శివయ్యను చిత్తూరు కలెక్టరేట్‌కు రిపోర్టు చేసుకోవాలన్నారు. వెదురుకుప్పం రీసర్వే డీటీ ఆర్.జయంత్ కుమార్‌ను తిరుపతి జిల్లాకు, ఏర్పేడు మండల డీటీ ఐ.శ్రావణ్ కుమార్‌ను చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు. కలెక్టరేట్ ఏవో పార్థసారథిని యాదమరి తహసీల్దార్‌గా, కలెక్టర్ సీసీ, డీఎస్వో ఆఫీసు డీటీ హుస్సేన్‌ను సదుం తహసీల్దార్‌గా నియమించారు. విజయపురం తహసీల్దార్ మాధవరాజును తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకు బైరెడ్డిపల్లి తహసీల్దార్‌గా నియమించారు. సదుం తహసీల్దార్ బి.కులశేఖర్‌ను చిత్తూరు కలెక్టరేట్ ఏవోగా, ఇదివరకు కలెక్టరేట్ ఏవోగా ఉన్న టి.సీతారామ్‌ను కుప్పం ఆర్డీవో కార్యాలయ డివిజనల్ పరిపాలనాధికారిగా నియమించారు. రొంపిచెర్ల డీటీ డి.లోకేష్‌ను తిరుపతి జిల్లాకు, తంబళ్లపల్లి మండలం రీసర్వే డీటీ జి.ఇషాక్‌ను చిత్తూరు జిల్లాకు బదిలీ చేసి, రొంపిచెర్ల తహసీల్దార్‌గా నియమించారు. తిరుపతి జిల్లా డీఎస్వో కార్యాలయ డీటీ పూజారి శ్రీనివాసులును అన్నమయ్య జిల్లాకు బదిలీ చేశారు.

నీటి కాలుష్యానికి పాల్పడితే కఠిన చర్యలు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 3: నగరి పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న డయ్యింగ్ యూనిట్ల కారణంగా నీటి కాలుష్యం ఏర్పడుతోందని స్థానిక ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారని, అట్టి యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ నగరి, చుట్టుపక్కల ప్రాంతాల్లో నిర్వహిస్తున్న డయ్యింగ్ యూనిట్ల ద్వారా విడుదలవుతున్న నీటి వల్ల దిగువ ప్రాంతాలైన నింద్ర, విజయపురం మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నాలుగు నెలల్లో మెకనైజ్డ్ డయ్యింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి పురోగతిని జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు. డీఐసీ జీఎం చంద్రశేఖర్, ఏజీఎం భార్గవి, నగరి మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పాల్గొన్నారు.

చెన్నై రేలా ఆసుపత్రి ద్వారా విశిష్ట వైద్యం

- నెల్లూరులో మెడికల్ సెంటర్ ప్రారంభించిన డాక్టర్ రేలా



మాట్లాడుతున్న డాక్టర్ రేలా

నెల్లూరు(వైద్యం), ఆగస్టు3: చెన్నై రేలా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ద్వారా ఇక నుంచి నెల్లూరు జిల్లా ప్రజలకు విశిష్ట వైద్య చికిత్సలు అందించనున్నట్లు ఆ ఆసుపత్రి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మొహ్మద్ రేలా తెలిపారు. నెల్లూరు నగరంలో ఏర్పాటు చేసిన రేలా మెడికల్ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ఇప్పటి వరకు చెన్నై రేలా ఆసుపత్రి ద్వారా 3వేల కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా చేశామన్నారు. మెర్సీ కిల్లింగ్‌కు కోర్టును ఆశ్రయించిన చిత్తూరు జిల్లాకు చెందిన 2 నెలల చిన్నారి జ్ఞానసాయికి 2016లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో కాలేయ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా చేశామని తెలిపారు. ప్రస్తుతం ఆ చిన్నారికి 8 ఏళ్ల వయసు వచ్చిందన్నారు. అలాగే పలు విభాగాల వ్యాధుల నివారణలో చెన్నై రేలా ఆసుపత్రి ఎంతో కృషి చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా నెల్లూరు ఆసుపత్రి ప్రారంభోత్సవంలో చిన్నారి జ్ఞానసాయి పాల్గొని డాక్టర్ రేలాకు పుష్పగుచ్ఛం అందించింది. అనంతరం పలు విభాగాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాస్కులర్ సర్జన్ డాక్టర్ సీఎంకే రెడ్డి, పలువురు వైద్య నిపుణులు పాల్గొన్నారు.

ఐదుగురు సీఐల బదిలీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 3: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఐదుగురు సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు డీఐజీ శనివారం ఉత్తర్వులు జారీ చేసారు. ఈ మేరకు తిరుపతి క్రైం స్టేషన్‌లో పనిచేస్తున్న రామకృష్ణను అన్నమయ్య జిల్లా స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. శ్రీసిటీలో పనిచేస్తున్న చిన్నపెద్దయ్యను అన్నమయ్య జిల్లా క్రైం స్టేషన్‌కు, తిరుమల సీసీఎస్‌లో పనిచేస్తున్న రెడ్డి శేఖర్ రెడ్డిని కలికిరికి, తిరుపతి ఎస్సీ ఎస్టీ సెల్‌లో పనిచేస్తున్న చాంద్ బాషాను మదనపల్లె వన్‌టౌన్‌కు, పాకాలలో పనిచేస్తున్న రాజగోపాల్‌ను బద్వేలుకు బదిలీ చేశారు.

స్వాతంత్ర్య వేడుకలను విజయవంతం చేద్దాం



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 3: మదనపల్లెలో నిర్వహించ నున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేద్దామని ఉత్సవ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. శని వారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మీడి యాతో మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ వేడుకల కోసం నిర్వహణ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఇందులో కన్వీనరుగా కె.రఘు నాథరెడ్డి, కో- కన్వీనర్లుగా రాటకొండ ప్రసాద్, ఆర్ కేశవరెడ్డి, ట్రెజరర్లుగా ఎం.కృష్ణప్ప, నిర్మల్ కుమార్‌రెడ్డి, దుర్గాప్రసాద్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్‌గా బండి ఆనంద్, గౌరవాధ్యక్షులుగా డాక్టర్ ఎన్. సేతు, కామకోటి ప్రసాదరావు, ఈ.వెంకటరెడ్డి, ఎస్ కృష్ణారెడ్డి, సాం స్కృతిక కార్యక్రమాల నిర్వహణకు శ్రీనివాసులు, మీడియా ఇన్‌చార్జీ మోడెం శ్రీనివాసరావు, కమిటీ సభ్యులుగా మహేష్, శ్రీనివాసులురెడ్డి, విజయలక్ష్మీ, శ్రీరాములు, ఉదయ్ భాస్కర్, శ్యామల నియమితులయ్యారు. ఈ ఏడాది ఆగస్టు 15న స్వాతంత్ర్య వేడుకల ద్వారా చారిత్రాత్మకమైన మదనపల్లె పట్టణ కీర్తిని దేశవ్యాప్తం చేయడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో గుడ్‌విల్ కంప్యూటర్స్ విజయ్ పాల్గొన్నారు.

వైద్యుల సూచనల మేరకే మందులు ఇవ్వాలి

నిమ్మనపల్లి, ఆగస్టు 3: మండలంలోని మెడికల్ దుకాణాల ద్వారా విక్రయించే మందులను వైద్యుల సూచనల మేరకే ఇవ్వాలని డ్రగ్ ఇన్ స్పెక్టర్ కేశవరెడ్డి పేర్కొన్నారు. శనివా రం స్థానికంగా ఉన్న 7 మెడికల్స్ షాపులను ఆయ న తనిఖీ చేశారు. అనంతరం ఆయన మా ట్లాడుతూ ప్రతి రోగి వైద్యుల దగ్గర చికిత్స చేసుకొని డాక్టర్ రాసి ఇచ్చిన మందుల చీటి తెచ్చిన రోగికి మాత్రమే మందులు ఇవ్వాలన్నారు. అలాగే నిషేధిత మందులను అమ్మ రాదని అలా చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మదనపల్లె పరిసర ప్రాంతాలలో 560 దుకాణాలు ఉన్నాయని నిత్యం ఎక్కడో ఒక చోట తనిఖీలు నిర్వహిస్తా మని తెలిపారు. దీంతో పాటు మెడికల్ షాపులలో జనరల్ షాపులకు సంబంధించిన వస్తువులు విక్రయించరాదని తెలిపారు. అనంతరం మెడికల్ షాపులలోని బిల్లులను పరిశీలించారు.

గ్యాస్ సిలిండర్ లీకై పాక్షికంగా దెబ్బతిన్న ఇల్లు

● తప్పిన పెను ప్రమాదం ● ఇంట్లో ప్లాస్టిక్, కరెంట్ వైర్లు పూర్తిగా దగ్ధం

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 3 : ఓ ఇంట్లో గ్యాస్ సిలిండ ర్ లీకై ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్న సంఘటన పీటీఎం లో చోటు చేసుకుంది స్థానికులు అందించిన సమాచా రం మేరకు..మండల కేంద్రమైన పీటీఎంలోని గంగుల్‌రెడ్డివీధిలో బందార్ల వెంకటనారాయణ రాజమ్మ దంప తులు వ్యవసాయ కూలీ చేసుకుంటు జీవనం సాగించే వారు. శనివారం ఉదయం రాజమ్మ వంట చేయడం కోసం గ్యాస్ స్టవ్ ఆన్‌చేయగా గ్యాస్ లీకై అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. భయంతో కేకలు వేసుకుంటూ రాజమ్మ ఇంట్లోంచి బయటకు పరుగులు తీసింది. గమనించిన చుట్టుపక్కల వారు వెం టనే స్పందించి గ్యాస్ సిలిండర్‌ను ఆపే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే గ్యాస్ సిలిండర్‌కు పెద్ద రంధ్రం పడి మంటలు వేగంగా వ్యాపించడంతో ఇంటి వైరింగ్ కూడా మంటలు అంటుకుని షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో ఇంట్లో గల వంట సామగ్రి, బట్టలు, ఇతరత్రా విలువైన వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాద సమయంలో కుటుంబ సభ్యులు ఇంట్లో లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. అగ్ని ప్రమాద సమాచారాన్ని తెలుసుకున్న ఆర్ఐ అనీషా, వీఆర్వో లలితకుమారి రెవెన్యూ సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను ఆరా తీశారు. ప్రమాదంలో 1.5 లక్షలు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. స్థానికంగా గల గ్యాస్ ఏజెన్సీ నిర్వాహ కులు అందుబాటులో లేకపోవడం గ్యాస్ సమస్యల పై సకాలంలో స్పందించ కపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కూలీ పనులు చేసుకుని జీవించే వెంకటనారాయణ కుటుంబం అగ్ని ప్రమాద ఘటనతో వీధిన పడిందని ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఐటీఐతో ఉద్యోగావకాశాలు ఎక్కువ

తంబళ్లపల్లె, ఆగస్టు 3: ఐటీఐ శిక్షణ పూర్తి చేసిన వారికి తక్కువ సమయంలోనే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగ, ఉపాధి పొందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తంబళ్లపల్లె ప్రభుత్వ ఐటీఐ వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఐటీఐలో శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ తిరుపతి వారు ఐటీఐ పూర్తి చేసిన యువకులకు జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాలో ఐటీఐ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ కోర్సులు చేసిన సుమారు 55 మంది వరకు నిరుద్యోగ యువకులు పాల్గొనగా వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి 38 మందిని ఎంపిక చేసుకున్నారు. కార్యక్రమంలో శ్రీజ కంపెనీ హెచ్‌ఆర్ డీవీ రవికుమార్, భావన, ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.



పాఠశాల భవనాలు అంతేనా..?


అసంపూర్తిగా ఉన్న పాఠశాల తరగతి గదులు

రామసముద్రం, ఆగస్టు 3: రామసముద్రం మండలం చెంబకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఆగిపోయిన తరగతి భవనాలు ఎప్పుడు పూర్తవుతాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. చెంబకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 653 మంది విద్యార్థులు ఉండగా 14తరగతి గదులు మాత్రమే ఉండడంతో పాఠశాల విద్యార్థులకు తరగతి గదులు కొరత వేధిస్తోంది. దీంతో 2018-19 విద్యా సంవత్సరంలో రాష్ట్ర మాధ్యమిక శిక్షా అభియాన్ పథకం కింద ఈ పాఠశాలకు ఆరు తరగతి గదుల నిర్మాణానికి రూ.60లక్షలు అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. ఇందులో మొదటి విడతలో రూ.30లక్షలు మంజూరు కాగా గ్రౌండ్ లెవల్‌లో మూడు గదులు, మొదటి అంతస్తులో మూడు గదులు నిర్మాణాలు జరిగాయి. అయితే మిగతా నిధులు మంజూరు కాకపోవడంతో వీటికి తలుపులు, కిటికీలు, ప్లాస్టింగ్, ఫ్లోరింగ్ పనులు నిలిచి పోయా యి. అప్పటి నుంచి ఈ గదులు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. నిర్మాణ దశలో ఉన్న పాఠశాల భవనాలకు కిటికీలు, తలుపులు లేకపోవ డంతో ఈ భవనాలు మందు బాబులకు అడ్డాగా మారాయి. అంతేకా కుండా పాఠశాల సెలవు రోజులు, పండుగ రోజులలో పేకాటరాయుళ్లు ఈ గదులలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో శుక్రవారం మండల పర్యటనకు వచ్చిన మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కు పాఠశాల భవనాల దుస్థితిని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు వివ రించి వాటిని పూర్తి చేయాలని కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి తరగతి గదుల నిర్మాణం, ప్రహరీ నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం


సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, నగరోత్సవంలో స్వామివారు

వాల్మీకిపురం, ఆగస్టు 3: వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభిరామాలయంలో శని వారం పునర్వసు నక్షత్రం పురస్కరించుకుని సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు టీటీడీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా కమనీయంగా నిర్వహించారు. ఉదయాత్పూర్వం సుప్రభాత సేవతో ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవ ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం నూతన వధూవరులైన సీతారామలక్ష్మణులకు విశేషాలంకరణలు గావించి ఆలయ మండపంలో కల్యాణ మహోత్సవ వేడుకలు కమనీయంగా సాగాయి. చివరగా హోమాధికార్యక్రమాలు పూర్ణాహుతి గావించి సాయంత్రం సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాములను తిరుచ్చిలో అలంకరణలు గావించి పురవీధులలో నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలలో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి


వాల్మీకిపురం కోర్టులో పోలీసులతో సమీక్షిస్తున్న జడ్జి గురుఅరవింద్

వాల్మీకిపురం, ఆగస్టు 3: వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టులో సెప్టెంబర్ 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ మెగా లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక జడ్జి గురు అరవింద్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టులో పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ ద్వారా అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో సీఐ పులి శేఖర్, వివిధ మండలాల ఎస్ఐలు, మండల న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

బి.కొత్తకోట, ఆగస్టు3: బి.కొత్తకోట పట్టణ ప్రజలు వారి వారి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలని నగర పంచాయతీ కమి షనర్ పీఆర్ మనోహర్ పేర్కొన్నా రు. స్టాప్ డయేరియా ప్రోగ్రాంలో భాగంగా శనివారం పట్టణంలోని బీసీకాలనీ ఎక్స్‌టెన్షన్ ఏరియాలో జరిగిన కాలువల పూడికతీత, పిచ్చి మొక్కల తొలగింపు, బ్లీచింగ్ చల్లే కార్యక్రమాలను కమిషనర్ పర్యవేక్షించారు. అక్కడి ప్రజలతో మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నగరపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

90శాతం రాయితీతో మల్బరీతోటల పెంపకం


మల్బరీ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నిమ్మనపల్లి, ఆగస్టు 3: వ్యవసాయ రైతులకు రాయితీతో మల్బరీ మొక్కల పెంపకానికి అవకాశం కల్పించనున్నట్లు పట్టు పరిశ్రమ శాఖ సహాయ సంచాలకుడు రామమోహన్, మదనపల్లె డివిజన్ అధికారి రసూల్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతి రైతుసేవా కేం ద్రం వద్ద పట్టుపరిశ్రమశాఖ ఆధ్వ ర్యంలో మల్బరీ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బైవోల్టైన్ పట్టుపురుగుల పెంపకం గది ఏర్పాటుకు ఎస్సీ, ఎస్టీ రైతులకు 90శాతం, అలాగే బీసీ, ఓసీ రైతులకు 75శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద 5ఎకరాల చిన్నకారు రైతులకు కూడా ప్రోత్సాహకం అందిస్తునట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి

నిమ్మనపల్లి, ఆగస్టు 3: మండలంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టి సాగుకు నీరు అందించాలని కొండయ్యగారిపల్లి పంచాయతి వెంకోజీగారిపల్లి చెంద్రాయుని కాలువకు చెందిన రైతులు కోరారు. ఆ మేరకు శనివారం స్థానిక ఆర్ఐ రాంప్రసాద్‌కు వారొక వినతి పత్రం అందించారు. బాహుదా ప్రాజక్టు కింద ఇసుక అక్రమ రవాణా జరుగుతుండడంతో కాలువలకు నీరు రాకుండా పోతోందని చెంద్రాయుని కాలువ కింద దాదాపు 80ఎకరాలలో టమాట, వరి, ఆవులకు గడ్డి వంటి వాటిని నాటుకొని జీవనం కొనసా గిస్తున్నారని తెలిపారు. దాదాపు వందల ట్రాక్టర్లు నిత్యం ఇసుకను అక్రమంగా తరలిస్తుడంతో కాలువలకు నీరు అందకుండా పోతోందని తెలిపారు.

రెండుచోట్ల ఉద్యోగుల పేర్లు..
ప్రభుత్వాస్పత్రి అధికారుల విచారణ

మదనపల్లె టౌన్, ఆగస్టు 3: మదనపల్లె సర్వజన బోధనాస్పత్రి, మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న ఉద్యోగుల పేర్లు రెండు చోట్ల నమోదైన విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు, మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ జమున విచారణ చేపట్టారు. ఒకే సమయంలో రెండు ఉద్యోగాల శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంలో వైద్యాధికారులు శనివారం విచారించారు. ఈ సందర్భంగా నలుగురు ఉద్యోగులను పిలిచి, వారు ప్రస్తుతం ఎక్కడ పనిచేస్తున్నారు. ఏ హాజరుపట్టికలో సంతకాలు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ జమున, సూపరింటెండెంట్ రాజు మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు రాజీనామా చేశారని, మరో ఇద్దరు మెడికల్ కాలేజికి అనుసంధానంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. సాంకేతిక లోపం కారణంగా నలుగురి పేర్లు రెండు చోట్ల ఉండటం జరిగి ఉంటుందన్నారు. జీవో నెంబర్ 67 ప్రకారం ప్రభుత్వ మెడికల్ కాలేజికి ఏడీ నగేష్ కుమార్‌కు హెచ్‌ఆర్ విధులు అప్పగించనున్నామన్నారు. కాగా ఆస్పత్రి ఏవోగా పుల్లంరాజు విధులు నిర్వహిస్తారన్నారు. ఈ రెండు సంస్థల్లో పనిచేస్తున్న సిబ్బంది, విధులు రెక్టిఫై చేశామని వివరణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలి దేవి, నర్సింగ్ సూపరింటెండెంట్లు మంజు, నాగశ్రీ, పాల్గొన్నారు.

వర్గీకరణకు సిట్టింగ్ జడ్జితో కమిటీ వేయాలి

వాల్మీకిపురం, ఆగస్టు 3: ఎస్సీ, ఎస్టీ వర్గీక రణకు వీధి విధానాల రూపకల్పనకు సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని ఎరుకల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీవీ రమణ శనివారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ రాజ్యాంగ బద్ధమేమని సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 34 గిరిజన తెగలు ఉన్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా 26.31 గిరిజన జనాభా కలిగిన అన్ని ప్రాంతాలలో ఉన్న గిరిజన కులాలను పరిగణలోకి తీసుకుని సమన్యాయం చేయాలని కోరారు. అలాగే ఉపకులాల జనాభా ఆర్థిక, సామాజిక, విద్య, ఉద్యోగ, సాంప్రదాయ జీవన విధానం సంక్షేమాలను ప్రాథమిక ప్రమాణాలుగా తీసుకుని రిజర్వేషన్ల వర్గీకరణకు సహకరించాలని కోరారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం


విద్యార్థికి ఆర్థిక సాయం చేస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

మదనపల్లె అర్బన్ ఆగస్టు3: స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల్లో గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో 567 మా ర్కులతోపాటు ట్రిపుల్ ఐటీ ఇడుపులపాయలో సీటు సాధించిన బి. రూపశ్రీ విద్యార్థినికి రూ.45 వేలు ఆర్థిక సాయం అందజేశారు. శనివారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి తండ్రి లేక తల్లి ఆర్థిక స్థోమత లేనందున విద్యాభ్యాసం కుంటుపడకుండా సాగాలని పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, పట్టణంలోదాతల నుంచి విరాళాలు సేకరించి విద్యార్థిని తల్లి అక్కమ్మకు రూ.45 వేలు అందజేసినట్లు హెచ్‌ఎం జనార్ధన్‌రెడ్డి తెలిపారు. ఏసీటీవో నాగేంద్రబాబు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మదనపల్లె నుంచి ముగ్గురు సీఐలు బదిలీ

మదనపల్లె అర్బన్, ఆగస్టు 3: మదనపల్లెకు చెందిన ముగ్గురు సీఐలను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో మదనపల్లె తాలుకా సీఐగా పనిచేస్తున్న ఎన్.శేఖర్‌ను జిల్లా కేంద్రం రాయచోటి హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ చేయగా ఆ స్థానంలో వాల్మీకిపురం సర్కిల్ నుంచి మదనపల్లె తాలుకా సీఐగా పులిశేఖర్‌ను బదిలీ చేశారు. మదనపల్లె వన్ టౌన్ సీఐగా పనిచేస్తున్న సీఐ వల్లీబసును వీఆర్‌కు పంపగా ఆ స్థానంలోకి తిరుపతి ఎస్సీ, ఎస్టీ సెల్‌లో సీఐగా పనిచేసిన ఎ.చాంద్‌బాషాను, మదనపల్లె రూరల్ సర్కిల్ సీఐగా పనిచేస్తున్న యు.సద్గురును జిల్లా హెడ్‌క్వార్టర్స్‌కు, ఆ స్థానంలో కర్నూల్ హెడ్ క్వార్టర్స్ నుంచి కె.రమేష్‌ను బదిలీ చేశారు. వీరు తమకు కేటాయించిన స్థానాల్లో రిపోర్టు చేసుకోవాలని కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పీలేరు నుంచి నలుగురు..

కలికిరి, ఆగస్టు 3: పీలేరు నియోజకవర్గంలోని నాలుగు పోలీసు సర్కిల్ కార్యాలయాలకు చెందిన నలుగురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేశారు. పీలేరు ఇన్‌స్పెక్టర్ ఎన్.మోహన్ రెడ్డి, కలికిరి ఇన్‌స్పెక్టర్ ఆర్.మోహన్, కలకడ ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసులును రాయచోటి ఎస్పీ కార్యాలయంలో వీఆర్‌కు బదిలీ చేశారు. వాల్మీకిపురం సీఐ పులి శేఖర్‌ను మదనపల్లెకు, కలికిరి సీఐగా తిరుమల సీసీఎస్ నుంచి కె.రెడ్డిశేఖర్ రెడ్డిని నియమించారు. అనంతపురం జిల్లా రాయదుర్గం నుంచి బదిలీ అయిన సీఐ జె.ప్రసాద్‌బాబును వాల్మీకిపురం సీఐగా, ఇంటెలిజెన్స్‌లో పనిచేస్తున్న ఎస్.గురునాథ్‌ను వెనక్కి రప్పించి కలకడ సీఐగా నియమించారు. కడప జిల్లా బద్వేలు అర్బన్ నుంచి పి.యుగంధర్‌ను పీలేరు ఇన్‌స్పెక్టరుగా నియమించారు.

నాగులబావిలో ఉచిత వైద్య శిబిరం

వాల్మీకిపురం, ఆగస్టు 3: మండలంలోని చింతపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధి నాగులబావి గ్రామంలో శనివారం వైద్యాధికారి డాక్టర్ సనాఆయేషా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు ఉన్న వారికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ సనాఆయేషా మాట్లాడుతూ ఈ వర్షాకాలంలో నీటిని కాచి చల్లార్చిన తరువాత తాగాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా మలేరియా, డెంగ్యూ వ్యాధులు నివారించవచ్చన్నారు. సబ్‌యూనిట్ ఆఫీసర్ ముజీబ్ బాషా, సూపర్‌వైజర్ సుధాకర్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గుర్రంకొండ, ఆగస్టు 3:రోడ్డుపై నడిచి వెళుతున్న చంద్రశేఖర్‌రెడ్డి(53) అనే వ్యక్తిని వెనుక నుంచి లారీ ఢీకొనడంతో శనివారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ తొట్లివారిపల్లెకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి నర్సరీ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇందులో భాగంగా శనివారం ఉదయం ఇంటి నుంచి నర్సరీ వద్దకు వెళుతుండగా గుర్రంకొండ నుంచి రాయచోటి వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో అతని కాలు, తలకు తీవ్ర రక్తగాయమైంది. వెంటనే బాధితుడ్ని చికిత్స నిమితం బెంగుళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఏఎస్ఐ నరసింహులు తెలిపారు.

వృద్ధాశ్రమానికి ఫ్రిజ్ వితరణ

మదనపల్లె అర్బన్, ఆగస్టు 3: స్థానిక బీకే పల్లెలోధాత్రి ఫౌండేషన్, శిల్ప్ స్వచ్ఛంద సంస్థల సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆనందనిలయం వృద్ధాశ్రమానికి దాత జీవదాత సేవా ట్రస్టు ఫౌండర్ మంజుల, తిప్పన్నలు శనివారం ఫ్రిజ్‌ను వితరణ చేశారు. పలమనేరు మండలం పెద్దపంజానికి చెందిన జీవదాత సేవా ట్రస్టు ఫౌండర్ మంజులా ఆనంద వృద్ధాశ్రమానికి వచ్చి వృద్ధుల బోగోగులు విచారించి వారికి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ధాత్రి ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ స్వాతి చక్రపాణి, శిల్ప్ సెక్రటరీ మరపురి హమశేఖర్, చక్ర పాణి, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన కూటమి నేతలు

ములకలచెరువు, ఆగస్టు 3: మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడును శనివారం తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి, నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్‌లు కలిశారు. మదనపల్లె డీఎస్పీగా కొండయ్యనాయుడు బాధ్యతలు స్వీకరించడంతో మదనపల్లెలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కురబలకోట మండల అధ్యక్షుడు వైజీ సురేంద్రబాదవ్, నాయకులు మస్తాన్‌రెడ్డి, మోహన్, రామకృష్ణ, సత్యనారాయణ, కొండ్రెడ్డి అశోక్, పట్టెం హరీష్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కురబలకోట, ఆగస్టు 3: మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో రికార్డులు తగులబెట్టిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ నాయకులు కృష్ణప్ప, సాంబశివలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని అంగళ్లులో ఈ నెల 4న జరిగే రెవెన్యూ భూబాధితుల సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రికార్డుల తగులబెట్టిన ఘటనపై ఎంతటివారైన అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో భూ ఆక్రమణలకు పూర్వ కలెక్టర్ గిరీషా, ఆర్డీవో మురళిలు సహకరించారని దీనికి వారిపై విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు.

బహిరంగ ప్రకటన

నా కక్షికర్తలైన శ్రీమతి లేట్ అమ్మినేని వసుంధర, భర్త లేట్ అమ్మినేని నారాయణస్వామి గార్ల వారసులైన శ్రీ అమ్మినేని భానుప్రకాష్, అమ్మినేని భార్గవి మరియు శ్రీమతి కల్లూరి భారతి గార్ల తరపున యావన్మందికీ తెలియజేయడం ఏమనగా!

క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తులకు సంబంధించిన విస్తీర్ణములు హక్కులకు గాను మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, మదనపల్లి వారి కోర్టు నందు జరిగిన O.S.No. 44/1992 అను భాగపరిష్కార దావా డిక్రీ మరియు జడ్జిమెంటుపై నా కక్షికర్తలు మహారాజశ్రీ ఏడవ అదనపు జిల్లా జడ్జి, మదనపల్లి వారి కోర్టు నందు A.S.No. 91/2016 అను అప్పీలు దాఖలు చేసి, సదరు అప్పీలు నందు I.A.No. 421 of 2018 అను STAY PETITIONను కూడా దాఖలు చేసి ఉన్నారు. మరియు సదరు వ్యాజ్యము పెండింగ్‌లో కలవు. మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, మదనపల్లి వారి కోర్టు నందు I.A.No. 43/2017 in O.S. No. 44/1992 అను Final Decree పిటీషన్ కూడా పెండింగ్‌లో కలదు.

అయితే సదరు పై తెలిపిన Appeal మరియు Final decree పిటీషన్ పెండింగ్ విషయములను మరుగున పెట్టి ప్రతివాదులైన శ్రీ మార్పూరి సుధాకర్ గారు వగైరాలు కొందరు షెడ్యూలు దాఖలా ఆస్తులలో ఇతరులకు క్రయవిక్రయాలు జరుపుటకు ప్రయత్నించుచున్నారని నా కక్షికర్తలకు తెలియవచ్చింది. కావున పై తెలిపిన అప్పీలు మరియు Final Decree పెండింగు కాలమున క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తులలో ఏలాంటి క్రయ విక్రయములు జరిపిన యెడల అవి చెల్లనేరవు అని ప్రకటన ద్వారా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు : (చిత్తూరు) అన్నమయ్య జిల్లా, మదనపల్లి సబ్ జిల్లా, బి.కె.పల్లి గ్రామం మరియు చిప్పిలి గ్రామం దాఖలా (కోడిగుడ్లు బావి జమీను)

	S. No.	A.C. (Full)		A.C.	
1)	226	10.22	Paiki	2.77	(చిప్పిలి గ్రామం)
2)	230/1	1-13	Paiki	0.25	(బి.కె.పల్లి గ్రామం)
3)	227	0.40	Paiki	0.13	(బి.కె.పల్లి గ్రామం)
4)	228	0.24	Paiki	0.08	(చిప్పిలి గ్రామం)
5)	277/2	1.69	Paiki	0.56	(పొన్నూటిపాళ్యం గ్రామం)
6)	416/3	5.00	Paiki	1.67	(పొన్నూటిపాళ్యం గ్రామం)

Sd/- D.MURALI KRISHNA, B.A., LLB.,
Advocate, Madanapallle.



నరసింహస్వామికి పూజలు

గుర్రంకొండ, ఆగస్టు 3:మండలంలోని తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలను చేశారు. స్వామి వారికి అభిషేకాలను చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలు శ్రేయస్కరం

తంబళ్లపల్లె, ఆగస్టు 3: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని సీడీపీవో నాగవేణి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో బాగంగా శనివారం తంబళ్లపల్లె-1, 2 అంగన్వాడీ కేంద్రాల్లో బాలింతలకు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ..ప్రసవం జరిగిన వెంటనే తప్పని సరిగా ముర్రుపాలను బిడ్డకు పట్టించాలని త ద్వారా బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు.

శ్మశానవాటికకు దారి కల్పించండి

మదనపల్లె టౌన్, ఆగస్టు 3: మదనపల్లె మండలం కాశీరావుపేటకు చెందిన దళితుల శ్మశానవాటికకు దారి కల్పించాలని గ్రామస్థులు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన వారు మాట్లాడుతూ మదనపల్లెకు చెందిన శ్రీనివాసులుశెట్టి వద్ద కాశీరావుపేట సమీపంలో భూమిని కొనుగోలు చేసిన సుధాకర్‌రెడ్డి దళితుల శ్మశానవాటికు దారి లేకుండా చేశాడన్నారు. అంతే కాకుండా సంక్రాంతి పండుగ నిర్వహించుకోవడానికి ఏర్పాటు చేసే కాటమరాజు గుడి లేకుండా చేశాడని ఆరోపించారు. దీనిపై రెవిన్యూ అధికారులు విచారించి దళితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగప్ప, కృష్ణప్ప, నరసింహులు, రెడ్డెప్ప, వెంకటరమణ, ద్వారక, రాంబాబు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

మదనపల్లె టౌన్, ఆగస్టు 3: మండలంలోని బసినికొండ జడ్పీహైస్కూల్లో ఎన్ఆర్ఐ లోకేశ్ జన్మదినం సందర్భంగా ఆయన మిత్రులు విద్యార్థులకు నోటుపుస్తకాలు, రైటింగ్ ప్యాడ్లు పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో ఫిజిక్స్ ఉపాధ్యాయుడు భాస్కరన్, పెరవలి నవీన్, నిరంజన్‌నాని, రాటకొండ రాజేష్, రాటకొండ మహేష్, వంశీ నరసింహ, కార్తీక్, విక్రమ్, గగన్, సాయిజశ్వంత్ పాల్గొన్నారు.

